# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :118 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 03-07-2024 | పేజీలు:4 వెల: 2.00


## త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఖాయం

హైదరాబాద్,సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని రావడంతో పాటు, గవర్నర్ రాధాకృష్ణన్‌కు కలిసి చర్చించడంతో మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు ఊంపదుకున్నాయి. ఇటీవలే మైకమాండ్ వద్ద మంత్రివర్గ విస్తరణపై చర్చించినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో త్వరలోనే తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఉంటుందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆయన సోమవారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలువురి మంత్రులశాఖలు సైతం మారే అవకాశాలున్నాయన్నారు. సీతక్కకు హోంమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందన్నారు. రాజగోపాల్‌రెడ్డి, దానం నాగేందర్, నిజామాబాద్ నుంచి ఒకరికి మంత్రివర్గంలో స్థానం లభించే అవకాశం ఉందన్నారు. రాజకీయాలు పరిస్థితులను బట్టి మారుతుంటాయన్నారు. 2018 ఎన్నిలకు ముందు ప్యారాషూట్లకు టికెట్లు లేవని రాహుల్ గాంధీ చెప్పారని.. కానీ పరిస్థితుల దృష్ట్యా టికెట్ల కేటాయింపు జరిగిందన్నారు. త్వరలో వైద్యశాఖలో ప్రక్షాళన, సంస్కరణలు తీసుకువస్తామన్నారు. వైద్యశాఖలో రెండే విభాగాలు ఉండాలన్నారు. ఇందులో ఒకటి అడ్మినిస్ట్రేషన్,రెండు ఎడ్యుకేషన్ అన్నారు.

## సైబర్ నేరాలే పెద్దవి: సిఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: అధికారుల్లో నైపుణ్యంతో పాటు ఆత్మస్థైరాన్ని నింపడం తమ బాధ్యత అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పోలీసులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని తెలియజేసారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నార్కోటిక్ బ్యూరో ఫోటో ఎగ్జిబిషన్‌ను సిఎం రేవంత్‌రెడ్డి తిలకించారు. వాల్‌బోర్డుపై మార్పు మన ప్రభుత్వ బాధ్యత అని సిఎం రాశారు. పోలీసులకు ప్రత్యేక వాహనాలు టిజి న్యాబ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో వాహనాలను పునరుద్ధరించడం. యాంటి నార్కోటిక్ బ్యూరో కోసం 27 కార్లు, 40 ద్విచక్ర వాహనాలు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో కోసం 14 కార్లు, 30 ద్విచక్రవాహనాలను కలిగి ఉంది. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. చదువుకున్నవారు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారు, సైబర్ నేరగాళ్ల ఫిర్యాదుకు 1930 టోల్ ఫ్రీనంబర్ ఏర్పాటు చేశామని, నేరగాళ్ల నుంచి సైబర్ క్రైమ్ పోలీసులు రూ.31 కోట్లు రాబట్టారని, కొత్త నేర న్యాయ చట్టాలపై కూడా పోలీసులకు శిక్షణ ఇవ్వాల్సి ఉందని, హత్య, అత్యాచారం ఈ కాలంలో సైబర్ నేరాలే పెద్దవిగా మారాయి. మధ్యతరగతి, పేదలే సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు ఎక్కువగా గంజాయికి బానిసలుగా మారుతున్నారని, సమర్థత ప్రదర్శించిన అధికారులకు పదోన్నతులు ఇచ్చే మా ప్రభుత్వానిది అని, మనం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య డ్రగ్స్, సైబర్ నేరాలు అని, డ్రగ్స్ నేరగాళ్లు తెలంగాణ నేలపై అడుగు పెట్టాలంటే భయపడాలని రేవంత్ రెడ్డి అన్నారు. చిరంజీవి ముందుకొచ్చి డ్రగ్స్‌పై అవగాహన వీడియో ఇచ్చారని, డ్రగ్స్‌పై పోరాడుతున్న చిరంజీవిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రేవంత్ ప్రశంసించారు. సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత సినీ పరిశ్రమపై ఉందని, టికెట్ల ధరలు పెంచాలని సినీ పెద్దలు తమ దగ్గరకు వస్తున్నారు. డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై సినీ పరిశ్రమ అవగాహన కల్పించడం.

## బీఆర్ఎస్ హయాంలో పల్లెల ప్రగతికి నెలకు రూ. 275 కోట్లు ఖర్చు పెట్టాం

హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పల్లెల ప్రగతికి నెలకు రూ. 275 కోట్లు, ఏడాదికి రూ. 3,330 కోట్లు ఖర్చు పెట్టామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ నిధుల'న్నింటిని పారిశుద్ధ్య నిర్వహ'ణ'కు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్న ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీలకు కేటాయించలేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పట్టణాల్లో కూడా మున్సిపాలిటీలకు ఏడాదికి రూ. 1700 కోట్లు ఇచ్చాం. మీరు వచ్చి ఏడు నెలలు అయినా ఏడు పైసలు కూడా ఎందుకు ఇవ్వలేదు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయాలనుకుంటున్నారా..? మలేరియా, డెంగీ వంటి వైరల్ ఫివర్ నియంత్రణకు చార్యలు తీసుకోవడం ఎందుకు..? బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతికి గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేశాం. దాదాపు ఈ నమూనాలకు గత ఐదేండ్లలో రూ. 20 వేల కోట్లు ఖర్చయింది బీఆర్ఎస్. ఏడు నెలల కాలంలో 20 పైసలు కూడా ఖర్చు పెట్టలేదు కాంగ్రెస్ గవర్నమెంట్. ఇది బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా..? అని హరీశ్‌రావు తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలకు కూడా ఏడు నెలలుగా జీతాలు అందడం లేదు. తక్షణమే పారిధ్య కార్మికులతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీలకు జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లు ఉంది కాంగ్రెస్ ప్రభుత్వం పోకడ. పంచాయ'తీల'ను నిర్వీర్యం చేస్తున్నారు. తమ ప్రభుత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా స్థానిక సంస్థలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో అడడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ అనే కొత్త పోస్టును క్రియేట్ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ, పల్లెల అభివృద్ధి కోసం వారి సేవలను వినియోగించుకున్నాం. ఇప్పుడు ఆ వ్యవస్థను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరవండి. పల్లెలను గాడిన పెట్టండి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచించారు.

### పల్లెలను ఎందుకు గాలికి వదిలేశారు..

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంలో పాలన అస్తవ్యస్తంగా తయారైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. పరిశుభ్రంగా ఉంచాల్సిన పల్లెలను ఎందుకు గాలికి వదిలేశారు అని హరీశ్‌రావు నిలదీశారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ గ్రామపంచాయతీల్లో చెత్త సేకరణకు కేవలం 87 ట్రాక్టర్లు మాత్రమే ఉండేవి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత 12,769 పంచాయతీల్లో




12,769 ట్రాక్టర్లను స'మ'కూర్చి చరిత్ర సృష్టించింది. కేంద్రం గ్రామ పంచాయతీలకు ఇచ్చే అవార్డుల్లో తెలంగాణ పల్లెలు లేకుండా అవార్డులు లేవు. తెలంగాణ పల్లెలు, మండలాలు, జిల్లాలు ఉత్తమంగా నిలిచాయి. కానీ కాంగ్రెస్ పాలనలో గ్రామ పంచాయతీలు కూనరిల్లుతున్నాయి. పల్లెలు కన్నీరు పెట్టే పరిస్థితి ఉంది. మురికి కూపాలుగా మారుతున్నాయి. డీజిల్ పోయించుకునే ప రిస్థితి లేదు. ట్రాక్టర్లు మూలకు పడ్డాయి. ఇది ఇవాళ పరిస్థితి. కొన్ని చోట్ల పంచాయతీ సెక్రటరీలు అప్పులు చేసి డిజిల్ పోయాయి. నా నియోజకవర్గానికి నిన్న వెళ్లాను.. స్పష్టంగా అధికారులతో మాట్లాడిన తర్వాతనే మాట్లాడుతున్నాను. కరెంట్ బిల్లులు కట్టేందుకు కూడా గ్రామపంచాయతీల వద్ద డబ్బుల్లేవు. కేసీఆర్ ఉన్నపుడు కరెంట్ బిల్లులు సయమానికి కట్టేవారు. ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు డబ్బులు, పారిశుధ్య కార్మికులు వేతనాలు ఇచ్చేవారు. ఇప్పుడు పాలనా అస్తవ్యస్తంగా తయారైంది అని హరీశ్‌రావు మండిపడ్డారు. పంచాయతీల్లో డబ్బుల్లేక చెత్త పేరుకుపోయింది. స్పెషల్ డ్రైవ్ లేదు. ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. ప్రజాప్రభుత్వంలో పారిశుద్ధ కార్మికులకు స్థానం లేదా..? ఒకటో తారీఖున జీతాలు ఇవ్వరా..? అంటురోగాల బారిన పడితే ఎలా..? పల్లెల మీద సమీక్ష ఎందుకు చేయట్లేదు. చివరకు సర్పంచులు పోయి గవర్నర్‌కు మొర పెట్టుకునే పరిస్థితి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వంలో. వేతనాలు అందక కార్మికులు ధర్నాలు చేస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి. బ్లీచింగ్ పౌడర్ నీళ్లల్లో కలపాలి. గడ్డి మందు లేదు. అస్తవ్యస్తం అయిపోయింది ప్రజా పాలన. పల్లెలను ఎందుకు గాలికి వదిలేశారు అని హరీశ్‌రావు నిలదీశారు.

## ఎబివిపి సర్వీస్ కమిషన్ కార్యాలయం ముట్టడి

హైదరాబాద్,జూలై2: టీజీపీఎస్సీ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. టీచర్ పోస్టుల సంఖ్యను పెంచి మెగా డీఎస్సీ నిర్వహించాన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌కి 1:100 పిలువాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల సంఖ్య పెంచే వరకు ఉద్యమిస్తామని ఏబీవీపీ కార్యదర్శి ఝాన్సీ స్పష్టం చేశారు. ఉద్యోగాలు భర్తీ చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రూప్-2, 3తోపాటు ఉపాధ్యాయ పోస్టులు చాలావరకు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఏబీవీపీ ముట్టడి నేపథ్యంలో టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద పెద్దఎత్తున పోలీసులు మోహరించారు. రోడ్డుపై బైఠాయించిన విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈక్రమంలో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ఒక్కొక్కరిగా అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. టీఎస్పీఎస్సీ కార్యాలయాన్ని ఏబీవీపీ విద్యార్థులు ముట్టడికి యత్నించడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మంగళవారం టీఎస్పీఎస్సీ కార్యాలయానికి ముట్టడించేందుకు ఏబీవీపీ యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకు వచ్చిన వారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తోంది. అలాగే గ్రూప్ 2 పోస్టులు పెంచి నోటిఫికేషన్లు ఇవ్వాలని విద్యార్థులు పట్టుబడుతున్నారు. తక్షణమే మెగా డీఎస్సీ విడుదల చేయాలంటూ నినాదాలు చేసారు. ఉపాధ్యాయ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏబీవీపీ ముట్టడి నేపథ్యంలో టీఎస్పీఎస్సీ కార్యాలయానికి పోలీసులు భారీగా చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వారిని ఖాకీలు అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై ఏబీవీపీ విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో గత తొమ్మిదిరోజులుగా గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్‌నాయక్ దీక్ష



విరమించారు. నిరుద్యోగుల డిమాండ్ల కోసం గత తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తున్నానని మోతీలాల్ నాయక్ చెప్పారు. కేసీఆర్ 9 రోజులు దీక్ష చేస్తే రాష్ట్రం వచ్చింది కానీ.. తాను దీక్ష చేస్తే ఒక్క ఉద్యోగం కూడా పెరుగలేద న్నారు. ఇతవరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇన్నిరోజులు అన్నపానియాలు లేకుండా ఆమరణ దీక్ష చేశా. తన ఆరోగ్యం సరిగ్గా లేదని, క్రియాటిన్ లెవల్స్ పెరిగి కిడ్నీ, లివర్లు పాడయ్యే పరిస్థితికి వచ్చింది. తెలంగాణ వచ్చిన తర్వాత నీళ్లు, కరెంటు వచ్చినయ్. 25 నుంచి 35 ఏండ్ల వయస్సు యువత ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం రాగానే తమ డిమాండ్లు పరిష్కరిస్తామని చెప్పారు. కానీ ఆ దిశగా అడుగులు మాత్రం పడలే. ఈ ప్రభుత్వానికి రాజకీయాల పై ఉన్న దృష్టి విద్యార్థులు, నిరుద్యోగులపై లేదు. ఉస్మానియా యూనివర్సిటీలో దీక్ష చేస్తానంటే సర్కారు ఒప్పుకోలేదు. మనుషులు చచ్చిపోయినా పట్టించుకో కపోవడం ప్రజాపాలనా?. నా ఫోన్ లాక్కుని ఎవరితోనూ మాట్లాడనీయడం లేదు. డీఎస్సీ రద్దు చేసి.. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలి. రేపటి నుంచి మా సత్తా ఏంటో చూపిస్తాం. 50 వేల ఉద్యోగాలు ఇచ్చే వరకు ఉద్యమాన్ని తీవ్రం చేస్తాం. ప్రభుత్వం జీవోలను విడుదల చేసే వరకు ఉద్యమిస్తామని చెప్పారు.

## విభజన సమస్యల పరిష్కార వేదికగా హైదరాబాద్



హైదరాబాద్,జూలై2: విబజన సమస్యలపై దాదాపు పదేళ్ల తరవాత ఇప్పుడు అడుగు పడబోతోంది. ఉమ్మడి ఎపిలో సిఎంగా ఉన్న చంద్రబాబు ఇప్పుడు అడుగు వేశారు. తెలంగాణతో కలసి చర్చించాలన్న నిర్ణయానికి వచ్చారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న కెసిఆర్ ఈ విషయంలో ఎక్కడ ఆచొరవ చూపలేదు. దీంతో అనేకానేక సమస్యలు అలాగే ఉండిపోయాయి. వాటిని పరిష్కరించు కోవడం ద్వారా ప్రజల్లో భరోసా కల్పించాల్సి ఉంది. ప్రజలుగా అంతా ఒక్కటిగానే ఉన్నారు. ప్రాంతాలు విడిపోయి నా విభేదాలు రాకూడదు. ఇప్పుడు ఇదే ప్రయత్నం కనిపిస్తోంది. ఈ క్రమంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయాక విభజన సమస్యలను పరిష్కరించుకోవడంలో గత పాలకులు విఫలమయ్యారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనం కోసం విభజన సమస్యల పరిష్కారం దిశగా సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. తద్వారా విభజన సమస్యలపై చర్చించుకుందామని.. పొరుగు రాష్ట్రాలుగా పరస్పర సహకారాలు అందించుకుందామని చంద్రబాబు తెలిపారు. 'తనదైన ముద్ర వేస్తూ పరిపాలన సాగిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇందుకు సిద్ధంగానే ఉన్నారు. ఆయన కూడా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్న సన్నద్ధతను గతంలోనే చాటారు. ఇందుకోసం కసరత్తు కూడా మొదలు పెట్టారు. అధికారులు, మంత్రులతో చర్చించి ఎజెండా కరారు చేసే పనిలో ఉన్నారు. ఇలా చేయడం తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడతాయి. మనం రెండు రాష్ట్రాల సమగ్ర, సుస్థిర అభివృద్ధి కోసం పరస్పరం సహకారం అందించు కోవాలని చంద్రబాబు కూడా సంకల్పం ప్రకటించారు. ఇప్పటికే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి 10 ఏళ్లు గడిచాయి. పునర్విభజన చట్టం ప్రకారం ఇంకా ఎన్నో సమస్యలు పరిష్కారం కావాల్సి ఉండగా అవన్నీ ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోయాయి. వాటి కారణంగా మన రెండు రాష్ట్రాల సంక్షేమం, ఇతర అంశాలకు అడ్డంకిగా మారుతోంది. వీటన్నింటిని మనం కూర్చొని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసం జూలై 6న శనివారం మధ్యాహ్నం మీ ప్రాంతంలో సమావేశం ఏర్పాటు చేసుకొందామని నేను ప్రతిపాదిస్తున్నాను. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న కీలకమైన సమస్యలు ఇలా ముఖాముఖి సమావేశంలో కూర్చొని చర్చించుకుంటేనే పరిష్కారం అవుతాయి. ఇరు రాష్ట్రాలకు లబ్ధికలిగే విధంగా పరస్పరం సహకరించుకోవాలి. మన భేటీ సత్ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నానుఅని చంద్రబాబు లేఖలో రాశారు. ఈ నెల 6న భేటీ కానున్నట్లు లేఖలో ప్రతిపాదించారు. పరస్పర సహకార అభివృద్ధికి మా భాగస్వామ్య నిబద్ధత వృద్ధి, శ్రేయస్సుకు మా పరస్పర లక్ష్యాలను సాధించడంలో కీలకమైనదన్నారు. పునర్వ్యవస్థీకరణ చట్టం నుండి ఉత్పన్నమయ్యే సమస్యల గురించి అనేక చర్చలు జరిగాయి. దీంతో శనివారం మధ్యాహ్నం తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ కానున్నారు. ఇందుకు ఇరు రాష్ట్రాల్లో కార్యాచరణ సాగుతోంది.

## 3035 కొలువులు.. భర్తీకి అనుమతి ఇచ్చిన ప్రభుత్వం




హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్‌ఆర్టీసీ)లో ఖాళీగా ఉన్న 3035 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపిన అన్ని పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ 3035 పోస్టుల్లో 2000 డ్రైవర్, 743 శ్రామిక్, 114 డిప్యూటీ సూపరింటెండెంట్(మెకానిక్), 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 23 అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్), 15 అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్, 11 సెక్షన్ ఆఫీసర్(సివిల్), 7 మెడికల్ ఆఫీసర్(జనరల్), 7 మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్) కొలువులు ఉన్నాయి. ఆర్టీసీలో వివిధ కేటగిరిల్లో 3035 పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు టీజీఎస్‌ఆర్టీసీలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ప్రజా రవాణా వ్యవస్థకు పెద్ద పీట వేస్తూ తమ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తోందన్నారు. ఈ కొత్త రక్తంతో రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా బలోపేతం చేస్తామని చెప్పారు. మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొత్త బస్సులను సంస్థ కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఈ కొత్త బస్సులకు అనుగుణంగా నియామకాలు చేపడుతున్నట్లు వివరించారు. వీలైనంత త్వరగా 3035 పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ప్రతీనెలా సమీక్ష

గుంటూరు,జూలై2: ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రతీనెల సమీక్షించి ప్రాధాన్యతల వారీగా లక్ష్యాలు నిర్ణయిస్తామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ...నెల రోజులలోపు నియోజకవర్గంలో చేపట్టాలనుకున్న పనులను గుర్తించామని.. సాగు నీటి కాలువల్లో పూడికతీత పనులు చెయ్యాలని నిర్ణయించామన్నారు. కాల్వల్లో గుర్రపుడెక్క పెద్ద ఎత్తున పేరుకుపోయి ఉందన్నారు. గత ఐదేళ్ళలో ప్రభుత్వం కాల్వల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. పూడిక తీత పనులకు గాను మొదటి క్యాబినెట్‌లోనే సీఎం ఆమోదించారని తెలిపారు. గతంలో పెద్ద కాంట్రాక్ట్‌లు వచ్చి పనులు చేయకుండా చేశామని బిల్లులు తీసుకునేవారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. రోడ్లపై గుంతలను తాత్కాలంగా పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గుంటూరు ఛానల్ పొడిగింపునకు కూడా నిధులు బ్జడెట్ లో పెట్టాలని అడిగామన్నారు. ఛానల్‌ను పర్చూరు వరకు పొడగించాలంటే మొదటి నుంచి కాలువను వెడల్పు చేయాల్సి ఉందన్నారు. ఛానల్ పొడగింపునకు ఇప్పటికే ప్రతిపాదనలున్నాయని.. వాటి మేరకు బ్జడెట్‌లో నిధులు మంజూరుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు.

## ఎడారి తెలంగాణకు కాళేశ్వరమే పరిష్కారం

హైదరాబాద్,జూలై2: తలాపున గోదారి గలగల పారుతున్నా తనువంతా ఎడారై ఎండిన శాపానికి విమోచన కాళేశ్వరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ కరువులకు కన్నీళ్లకు శాశ్వత పరిష్కారం కాళేశ్వరం ప్రాజెక్టు అని చెప్పారు. తెలంగాణ తెర్లైపోతే సంకలు గుద్దుకుందా మని చూసిన వంకరబుద్ధిగాళ్లకు ఈర్ష్య అసూయ పుట్టించి.. కన్నుకుట్టించిన మా వరప్రదాయిని అన్నారు. సముద్ర మట్టానికి ఎత్తున ఉన్న మా చేను చెలకలు నదీ జలాలతో తడవాలంటే ఎత్తిపోతలే శరణ్యమని తెలిపారు. దగాపడ్డ నేల దశాబ్దాలుగా జరిపిన గోదారి జలాల సాధన పోరాటాలకు సమాధానం కాళేశ్వరమంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'మా కరువులకు కన్నీళ్లకు శాశ్వత పరిష్కారం కాళేశ్వరం.!. మా వరప్రదాయిని కాళేశ్వరం!. తలాపున గోదారి గలగల పారుతున్న తనువంతా ఎడారై ఎండిన శాపానికి విమోచనం కాళేశ్వరం! దశాబ్దాలుగా జరిపిన గోదారి జలాల సాధన పోరాటాలకు సమాధానం కాళేశ్వరం!. శిథిల శివాలయంగా పాడుబడిపోయిన శ్రీరామ్ సాగర్‌కు పునరుజ్జీవమిచ్చిన పుణ్య వరం కాళేశ్వరం!. నీళ్లురాక.. ఒట్టిపోయిన నిజాంసాగర్‌కు నిండుకుండలా మార్చే అండ దండ కాళేశ్వరం!. మండుటెండల్లో



చెరువులను మత్తళ్లు దూకించిన మహత్యం కాళేశ్వరం. మా తపనకు, ఆలోచనకు, అన్వేషణకు, జలదౌత్యానికి నిదర్శనం కాళేశ్వరం. కాళేశ్వరం అంటే ఒక్క బరాజ్ కాదని తెలియని మీ అజ్ఞానం. ఎక్కడో ఒక లోపం తలెత్తడం సహజం సరిదిద్దుకోగలం. రాజకీయ కుళ్లు కుతంత్రాలను దిష్టి చూపులను తట్టుకోగలం. మీ ఏడుపే మా ఎదుగుదల' అంటూ పోస్ట్ చేశారు.


## సంపాదకీయం

**బుధవారం 03-07-2024**

# సత్వర న్యాయం.. చట్టాల లక్ష్యం కావాలి !

బాధితులకు న్యాయం చేయడంతో పాటు..సత్వర న్యాయం మన చట్టాల లక్ష్యం కావాలి. పాలకులు వారి అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటున్న చట్టాలను కూడా చర్చించాలి. చట్టం ఎవరికైనా ఒక్కటే అన్న భావన ప్రజల్లో రావాలి. రాజకీయ నాయకులు చట్టాల నుంచి తప్పించుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఆ మేరకు చట్టాల అమలులో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి. ఉదాహరణకు అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పుడు పనులకు సంబంధించి విచారణలు వేగవంత కావాలి. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను పూర్తిగా సంస్కరించి భారతదేశానికి అనుగుణంగా చట్టాల రూపకల్పన జరగాలి. ఐపిసి, సిఆర్‌పిసిల స్థానంలో కొత్తగా తీసుకుని వచ్చిన చట్టాలను స్వాగతించాల్సిందే. ఓ రకంగా చెప్పాలంటే భారత న్యాయ వ్యవస్థలో నూతన అధ్యాయానికి తెరలేచింది. మన దేశంలో బ్రిటిష్ వలస పాలన నుంచి కొనసాగుతున్న భారత శిక్షా స్మృతి(ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), భారత సాక్ష్యాధార చట్టం కనుమరుగు కానున్నాయి. వాటి స్థానంలో గతేడాది పార్లమెంటు ఆమోదించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్(బీఎస్ఏ) ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. జీరో ఎఫ్ఐఆర్, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు, ఎస్సెమ్మెస్ లాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ లాంటి అత్యాధునిక పద్ధతులు కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థలోకి వచ్చాయి.. వీటిని తేవడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, భారతీయుల కోసం భారతీయులు ఈ చట్టాలను రూపొందించారు. దీంతో ఇక వలస పాలన నాటి నేర న్యాయచట్టాలు శాశ్వతంగా కనుమరుగుకానున్నాయి. కొత్త చట్టాల ఆత్మ, శరీరం, స్ఫూర్తి అంతా భారతీయమేనని తెలిపారు. ఈ కొత్త చట్టాల ప్రకారం.. క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లోగా కచ్చితంగా తీర్పు వెలువడాలి. ఇందుకు అనుగుణంగా ఖచ్చితంగా పనిచేయాల్సి ఉంటుంది. తొలి విచారణ జరిగిన 60 రోజుల్లోపు అభియోగాలు నమోదు చేయాలి. వ్యవస్థీకృత నేరాలను, ఉగ్రచర్యల ను కొత్త చట్టాల్లో స్పష్టంగా నిర్వచించారు. రాజద్రోహం అనే పదాన్ని తొలగించారు. అయితే దేశ సార్వభౌమత్వం, సమగ్రతలకు భంగం కలిగించే చర్యలను శిక్షార్హం చేశారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల కోసం కొత్త అధ్యాయాన్ని చేర్చారు. కొత్త చట్టాల ప్రకారం.. చిన్నారులపై సామూహిక అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష లేదా యావజ్జీవశిక్ష పడనుంది. రద్దయిన ఐపీఎస్‌లో కొన్ని సెక్షన్లు సంక్లిష్టంగా ఉండేవి. ఏ నేరం ఏ సెక్షన్ కిందకు వస్తుందన్న విషయంలో కాస్త గందరగోళం ఉండేది. వాటిని ప్రస్తుతం సరళతరం చేశారు. భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ)లో 511 సెక్షన్లు ఉంటే భారతీయ న్యాయ సంహితలో ఆ సంఖ్యను 358కి కుదించారు. ఐపీసీలోని 6 నుంచి 52 సెక్షన్ల మధ్య ఉన్న పలు నిర్వచనా లను ఒక సెక్షన్ కిందకు తెచ్చారు. 18 సెక్షన్లను ఇప్పటికే రద్దు చేశారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడం, చిన్నారులపై సామూహిక అత్యాచారం, మూకదాడి తదితర నేరాలకు ఐపీసీలో ప్రత్యేకంగా సెక్షన్లు లేవు. దీంతో గందరగోళం ఏర్పడేది. భారతీయ న్యాయ సంహితలో ఆ లోటును పూడ్చారు. ఇందుకు సంబంధించి చట్టాలను రూపొందించారు. క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు మరింత పకడ్బందీగా జరగడానికి వీలుగా తీవ్రమైన నేరాల్లో సాక్ష్యాల సేకరణకు ఫోరెన్సిక్ నిపుణులు సంఘటన స్థలాన్ని సందర్శించడాన్ని తప్పనిసరి చేశారు. దాదాపు 150 ఏళ్లుగా అమలులో ఉన్నచట్టాలకు పాతరేయడం ఓ మంచి పరిణామంగా చేయాలి. ఇందుకు అనుగుణంగా పోలీసులు, న్యాయస్థానాలను కూడ ఆసన్నద్దం చేయాలి. ఇప్పటికే అనేక దశలుగా పోలీస్‌లకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. కంప్యూటర్ వ్యవస్థలో అవసరమైన మార్పులు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా దర్యాప్తు, న్యాయవిచారణ చేసేందుకు కొత్త చట్టాలు ఊతమిస్తాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. 14 రోజుల్లోగా దర్యాప్తు చేపట్టి కేసును కొలిక్కి తేవాలన్న ప్రాథమిక లక్ష్యం ఇందులో కనిపిస్తోంది. మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి బాధితురాలి వాంగ్మూలా న్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేని పక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలి. బాధితులతోపాటు నిందితులు కూడా ఎఫ్ఐఆర్ నకళ్లను ఉచితంగా పొందే వీలుంటుంది. వీటితోపాటు పోలీస్ రిపోర్టు, ఛార్జిషీటు, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్లను 14 రోజుల్లోగా పొందవచ్చని కొత్త చట్టం పేర్కొంటోంది. ఇదే క్రమంలో కేసు విచారణలో అనవసర జాప్యాన్ని నివారించడానికి, సకాలంలో న్యాయం అందేలా చేయడానికి, న్యాయస్థానాలు కూడా గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి.సాక్షుల భద్రతను వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకుని, సాక్షుల రక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పని సరిగా అమలు చేయాల్సి ఉంటుంది. అత్యాచార నేరాల కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీస్‌లు నమోదు చేయాల్సి ఉంటుంది. మహిళలు,దివ్యాంగులు,దీర్ఘకాల వ్యాధిగ్రస్తులతో పాటు 15 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయసు వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది. వారు తాము నివాసం ఉన్న చోటే పోలీస్‌ల సాయం పొందవచ్చు. స్వల్ప నేరాలకు సంబంధించి నేరస్థులకు సమాజ సేవచేసే అవకాశాన్ని కొత్త చట్టాలు కల్పిస్తున్నాయి. ఆర్థిక సంబంధ నేరాల్లో నిందితుల ఆస్తులు, నేరం ద్వారా సంక్రమించిన సొమ్ముతో వారు కొన్న స్థిర, చరాస్తులనూ జప్తు చేసే అధికారం పోలీస్‌లకు ఉంటుంది. సాక్షుల వాంగ్మూలాలు, ఆడియో, వీడియో సాక్షాలన్నింటినీ జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన డిజి లాకర్‌లో భద్ర పరుస్తారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్ఎస్) ద్వారా ఇప్పటికే దేశ వ్యాప్తంగా అన్నిపోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేసినందున , సాక్షాలను ఆన్‌లైన్ ద్వారా పంపుతారు. డిజి లాకర్‌ను ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం (ఐసీజేఎస్) కు అనుసంధానం చేస్తారు. పోలీస్‌లు, న్యాయవాదులు, న్యాయమూర్తులు అవసరమైనప్పుడు సాక్షాలను పరిశీలించుకోవచ్చు. దీని వల్ల ఆధారాలు మాయం చేయడం సాధ్యం కాదు. పాత చట్టాల కింద నమోదైన కొన్ని కేసులు నెలల తరబడి దర్యాప్తు, కొన్నేళ్ల పాటు విచారణ జరిగే అవకాశం ఉంది. దీంతో దర్యాప్తు అధికారులు పాత, కొత్త చట్టాలపై సమగ్ర అవగాహనతో ఉండాలి. రెండు రకాల కేసులు కలిపి దర్యాప్తు, న్యాయ విచారణ జరిపేటప్పుడు, సంక్లిష్టత ఎదురయ్యే అవకాశం రాకుండా చూడాలి. చట్టాలను తెచ్చిన బిజెపి ప్రభుత్వం ఇవి సమగ్రంగా, పారదర్శకంగా అమలు చేసేలా కార్యాచరణ చేయాలి. క్షేత్రస్థాయిలో పోలీసులక శిఓణ ఇవ్వాలి. అందుకు తగ్గట్లుగా కోర్టులను సిద్దం చేయాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందచేయాలి. అన్ఇనంటిని మించి పటిష్టం చట్టాలను పక్కాగా అమలు చేసి, ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పగలగాలి. ఇందుకు పార్లమెంట్ కూడా జవాబుదారీ కావాలి.

# పోలవరం దారెటు?



అమరావతి,ఆంధ్రప్రదేశ్‌కు ప్రతిష్టాత్మకంగా చెబుతున్న పోలవరం ప్రాజెక్టుపై టిడిపి కూటమి ప్రభుత్వం వెలువరించిన శ్వేతపత్రంలో నిర్వాసితుల పరిహారం, పునరావాసానికి ప్రాధాన్యమివ్వకపోవడం ఆందోళనకర విషయం. రాష్ట్రానికి జీవనాడిగా అభివర్ణిస్తున్న ప్రాజెక్టు కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన లక్షల మంది నిర్వాసితుల గురించి ప్రభుత్వం పొడిపొడి మాటలతో దాటవేయడం అమానవీయం. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్వాసితుల పునరావాసంపై పదేళ్లుగా దోబూచులాడుతున్న, నిధులివ్వకుండా తాత్సారం చేసిన, ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న అవకతవకల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఒక్కటంటే ఒక్క మాట శ్వేతపత్రంలో ఉదరించకపోవడం సరికాదు. ఒక వైపు తప్పులు చేసిన మోడీ ప్రభుత్వాన్ని కాపాడుతూ గత వైసిపి ప్రభుత్వ ప్రమాదకర ధోరణులను ఎత్తిచూపి, అంతకుముందు తన హయాంలో అద్భుతాలు చేశామని పేర్కొన్నారు. ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉండండి, తనపై బిజెపి ప్రభుత్వం ఆధారపడ్డ స్థితిలో కూడా కేంద్రం నుంచి నిధులు సాధిస్తామని, గట్టిగా నిధులు అడుగుతామని శ్వేతపత్రంలో కనీసమాత్రమైనా ముఖ్యమంత్రి చెప్పలేదు.టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాలూ పోలవరం అంటే డ్యామ్ నిర్మాణం, ఇతర సివిల్ పనులు చూశాయే తప్ప ప్రాజెక్టుల కోసం ఊళ్లూ, ఇళ్లు, భూములు త్యజించిన నిర్వాసితుల గోడు పట్టించుకోలేదు. రిజర్వాయర్‌లో లక్షా ఆరు వేల కుటుంబాలు మునుగ ఎప్పుడో ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన 2005లో అంచనా వేయబడింది. రెండు దశాబ్దాల అనంతరం సామాజిక ఆర్థిక సర్వే పేరుతో ముంపు కుటుంబాలు 96 వేలకు కుదించినట్లు శ్వేతపత్రంలో ఉన్నాయి. త్వరలో కాఫర్ డ్యాం కట్టాక కొద్దిపాటి వరదలొస్తే చాలు కాంటూరు సర్వేల కంటే అదనపు ప్రాంతాలు మునుగుతున్నాయి. ఇంకోవైపు ఈ ఇరవై ఏళ్ల కాలంలో జనాభా పెరిగింది. 18 ఏళ్లు నిండిన వారూ పెరిగారు. జనాభా, కుటుంబాలు పెరుగుతుండగా, నిర్వాసితులయ్యే కుటుంబాలను తగ్గించడం వెనకున్న మర్మం ఏమిటో అర్థం కాదు. ఎక్కడికాని ప్రాజెక్టులు గాలిలో కట్టారు. అభివృద్ధిలో భాగంగా ప్రాజెక్టులు నిర్మించేటప్పుడు వాటి వలన నిర్వాసితులయ్యే వారందరికీ పూర్తి స్థాయిలో పునరావాసం కల్పించకనే నిర్మాణం ప్రారంభించాలన్నది సహజ న్యాయసూత్రం. అంతర్జాతీయ చట్టాలు అదే చెబుతున్నాయి. దశల పేరుతో నిర్వాసితులకు పునరావాసం కల్పించడం త్యాగధనుల పట్ల ప్రభుత్వాల అమానవీయతను సూచిస్తుంది.గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచితం, అవకతవకల వలన పోలవరం స్తంభించినందున తొలి దశకు నాలుగేళ్లు పడుతుందని శ్వేతపత్రంలో టిడిపి ప్రభుత్వం ప్రకటించింది. తొలి దశ నిర్వాసితుల పునరావాసం రెండేళ్లలో పూర్తవుతుందని, రెండవ దశ పునరావాసం ఆపై దశలవారీగా కొనసాగుతుంది. ఇన్నేళ్లయినా పునరావాసం కోసం పోరాడుతున్న గిరిజన, పేద నిర్వాసితులకు దరిదాపుల్లో పునరావాసం దక్కదని ప్రభుత్వ శ్వేతపత్రంతో అర్థమైపోయింది. తొలి, మలి దశల్లో పునరావాసానికి ఇంకా రూ.25 వేల కోట్లు కావాలంటోంది ప్రభుత్వం. మొదటి ప్రాధాన్యతలో ఆ నిధులు కేంద్రం నుంచి రాబట్టే విషయంలో మాత్రం నాలిక మడత పెడుతోంది. డిజైన్ల దగ్గర నుంచి అంచనాల వరకు, కాఫర్ డ్యాము నుంచి డయాఫ్రంవాల్, గైడ్‌బండ్, రివర్స్ టెండర్ల వరకు అన్నీ కేంద్ర సంస్థల కనుసన్నల్లోనే జరిగాయి. కాబట్టి టిడిపి, వైసిపి, ఏ ప్రభుత్వం తప్పు చేసినా కేంద్ర అండదండలు పుష్కలంగా ఉన్నాయని స్పష్టం చేశారు. జాతీయ ప్రాజెక్టు బాధ్యత కేంద్రానిదే అయినందున పోలవరంలో తప్పిదాలకు బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం, ఆధీనంలో కేంద్ర సంస్థలు దానిని తప్పించుకోజాలవు. అవకతవకలకు బాధ్యులైన వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. దశలతో నిమిత్తం లేకుండా ఒకేసారి నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాలి. ముంపుపై శాస్త్రీయ సర్వే చేసి నిర్ధారించాలి. ఆగస్టులో గోదావరి వరదల ముప్పు ఉన్నందున ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి. అందుకు యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలి.

# హిందూ, ముస్లిం ఘర్షణ మిగిల్చిన గాయాలతో పోరాడుతున్న బ్రిటిష్ నగరం



లీస్టర్ వీధుల్లో భారత సంతతికి చెందిన కీత్ వాజ్ ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేయడం చూస్తుంటే 2022 సెప్టెంబర్‌లో హిందువులు, ముస్లింల మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగిన ప్రదేశం ఇదేనా అని అనిపిస్తుంది.యూకేలోని తూర్పు లీస్టర్ స్థానంలో కీత్ వాజ్ 32 ఏళ్ల పాటు లేబర్ పార్టీ ఎంపీగా పనిచేశారు. ఈసారి ఆయన వన్ లీస్టర్ అనే కొత్త పార్టీ నుంచి బరిలోకి దిగారు. లీస్టర్‌తో చాలా ఏళ్లుగా అనుబంధం ఉన్న ఆయన ఇక్కడ సుపరిచితులు.అయితే, విభిన్న సంస్కృతులకు ఉదాహరణగా పరిగణించే లీస్టర్ విషయంలో అప్పుడు జరిగిన హింస, ఉద్రిక్తతల గురించి కీత్ వాజ్ వారితో మాట్లాడలేదు.ప్రజలను కలిసినప్పుడు స్థానిక సమస్యలపైనే మాట్లాడుతుంటారు.2022 సెప్టెంబర్ 17న రెండు వర్గాల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతలు వీధుల్లోకి వచ్చాయి. ఈ ఘర్షణల్లో కొంతమంది పోలీసులు కూడా గాయపడ్డారు, ఆందోళనలకు పాల్పడిన డజన్ల మందిని అరెస్టు చేశారు.సాధారణంగా భారత్–పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ల సమయంలో ఇలాంటి ఉద్రిక్తత కనిపించేదని స్థానికులు చెప్పారు. కానీ 2022లో పరిస్థితి మరింత దిగజారింది, రెండు వర్గాల మధ్య ఆగ్రహం స్పష్టంగా కనిపించింది.లీస్టర్‌లోని బెల్‌గ్రేవ్ రోడ్డులో గుజరాత్ సంతతికి చెందిన ధర్మేష్ లఖానీ రెస్టారెంట్ నడుపుతున్నారు. ఆనాటి జ్ఞాపకాలు ఇప్పటికీ ఆయన మదిలో మెదులుతూనే ఉన్నాయన్నారు.ధర్మేష్ బెల్‌గ్రేవ్ రోడ్‌లో హింస జరిగిన ప్రదేశాన్ని చూపిస్తూ "ఆ రోజు వందలాది మంది ఇక్కడే గుమిగూడారు. చాలా కోపంగా ఉన్నారు. నేను ఇక్కడ నిలబడి ఏం జరుగుతుందోనని చూశాను. మా నగరం దహనమైనట్లు అనిపించింది" అని అన్నారు.లఖానీ బెల్‌గ్రేవ్ రోడ్‌లోని కార్ వాష్ షాపును చూపిస్తూ "ఈ కార్ వాష్‌ను పోలీసులు చుట్టుముట్టారు. లోపల దాదాపు 150 నుంచి 200 మంది హిందువులున్నారు. బయట పెద్ద సంఖ్యలో ముస్లింలు ఉన్నారు" అని అన్నారు ధర్మేష్.కార్ వాష్‌కి ఎదురుగా హిందూ దేవాలయం ఉందని, అల్లరి మూకలోని కొందరు ఆలయం గోడ దూకి, అందులోని జెండాను తీసి, తగలబెట్టేందుకు ప్రయత్నించారని ధర్మేష్ చెప్పారు."జెండా కాలిపోతుండటంతో వెంటనే మరో ముస్లిం యువకుడు మంటలను ఆర్పివేశారు, అప్పటికే అది కొద్దిగా కాలిపోయింది. అలా జెండాలకు నిప్పుపెట్టేవాళ్లు హింసను ప్రేరేపించడానికి ప్రయత్నించేవారే. కానీ ఆ గుంపులోని అందరూ అలా లేరు. అయితే, అప్పుడు జరిగినదైతే సరైంది కాదు, ఇరు వర్గాలు చాలా బాధపడ్డాయి" అని అన్నారు ధర్మేష్.బ్రిటన్‌లో జులై 4న సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఈస్ట్ లీస్టర్ స్థానం నుంచి మొత్తం 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది దక్షిణాసియా మూలాలు ఉన్నవారు.ఈ అభ్యర్థులు లీస్టర్‌లో పెద్దసంఖ్యలో స్థిరపడిన దక్షిణాసియా జనాభా ఓట్లతో ఈ సీటును గెలుచుకోవాలని ఆశిస్తున్నారు.అయితే దక్షిణాసియా దేశాల్లో ముఖ్యంగా భారత్‌లో ఎన్నికల వాతావరణం కనిపించే తీరుకు లీస్టర్ చాలా భిన్నంగా ఉంది. ఇక్కడ కొంతమంది అభ్యర్థుల పోస్టర్లు, బ్యానర్లు బహిరంగ ప్రదేశాల్లో కనిపించవు.చాలావరకు శని, ఆదివారాల్లో ఎన్నికల ప్రచారం చేస్తుంటారు. ఎందుకంటే ఉద్యోగాలు చేసేవారు, పనులకు వెళ్లేవారు ఆరోజు ఎక్కువగా ఇంట్లో ఉంటారు. అభ్యర్థులు ప్రచారం కోసం ప్రజల ఇళ్లకు, దుకాణాలకు వెళుతున్నారు.చాలామంది దృష్టి తూర్పు లీస్టర్ సీటుపై ఉంది. ఎందుకంటే 2022 సంఘటనల తర్వాత దక్షిణాసియా వాసులు ఏ పార్టీ లేదా అభ్యర్థిపై విశ్వాసం ఉంచారనేది ఆసక్తికరంగా మారింది.

'వైవిధ్యానికి ఉదాహరణ'

1951 జనాభా లెక్కల ప్రకారం లీస్టర్‌లో దక్షిణాసియా మూలాలున్నవారు 624 మంది. కానీ, ఇప్పుడు బ్రిటిష్ సౌత్ ఆసియన్లు అత్యధికంగా ఉన్న నగరాల్లో లీస్టర్ ఒకటి.

1950ల నుంచి భారతీయులు, పాకిస్తానీలు చెయిన్ మైగ్రేషన్ ద్వారా లీస్టర్‌కు వచ్చారు. అంటే, వారి కుటుంబ సభ్యులు లేదా గ్రామస్తులు మొదట ఇక్కడ నివసించారు, దీంతో వాళ్లు కూడా ఇక్కడకు వచ్చారు. లీస్టర్ వారికి ఆకర్షణీయంగా కనిపించింది. ఇది సంపన్నమైనది కూడా. డన్‌లాప్, ఇంపీరియల్ టైప్‌రైటర్, హొజరీ మిల్లులలో ఉద్యోగాలూ ఉన్నాయి.

చాలామంది కొత్తవారు మొదట్లో ఉత్తర, తూర్పు లీస్టర్‌లోని బెల్‌గ్రేవ్ రోడ్, స్పిన్నే హిల్ పార్క్ వంటి ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వచ్చినవారిలో భారతదేశ విభజన సమయంలో హింసను చూసిన హిందువులు, ముస్లింలు, సిక్కులు కూడా ఉన్నారు.

1960వ దశకం ప్రారంభంలో వారి కుటుంబాలు కూడా ఇక్కడికి రావడం ప్రారంభించాయి. లీస్టర్ దశాబ్దాలుగా సాంస్కృతిక వైవిధ్యం, సహనం, సమాజ ఐక్యతకు ఒక ఉదాహరణగా ఉంటోంది.

ఈస్ట్ లీస్టర్ మాజీ ఎంపీ కీత్ వాజ్ మాట్లాడుతూ "లీసెస్టర్ గురించి తెలిసిన ఎవరికైనా ఇది షాకింగ్‌గా అనిపిస్తుంది. ఇది విభిన్న మతాలు, నేపథ్యాలకు చెందిన వ్యక్తులతో ఉన్న ప్రదేశం. ఆ ఘటన జరిగినప్పుడు నాకు షాక్‌గా అనిపించింది. మేం గతంలో అలాంటిది చూడలేదు" అని అన్నారు.

'2022 హింస' వెనుక కోవిడ్ లాక్‌డౌన్, ఇక్కడి ఆర్థిక పరిస్థితి, ఉపాధి లేకపోవడం సహా చాలా కారణాలు ఉన్నాయని కీత్ వాజ్ అభిప్రాయపడ్డారు.

"ఇది ఒక్కసారి మాత్రమే జరిగే సంఘటన అనుకుంటున్నా. అలా ఎందుకు జరిగిందో తెలుసుకోవడానికి మనం ప్రయత్నించాలి" అని ఆయన సూచించారు.

ఘర్షణ జరిగిన బెల్‌గ్రేవ్ రోడ్ ఎలా ఉంటుంది?

బెల్‌గ్రేవ్ రోడ్‌కి వస్తుంటే మీరు భారతదేశంలో ఉన్నట్లు అనిపిస్తుంది. రెస్టారెంట్లు అయినా దుస్తులు, జ్యువెలరీ షాపులైనా చాలావరకు భారత సంతతికి చెందిన వారివే ఇక్కడ కనిపిస్తాయి.

2022లో రెండు వర్గాల మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగిన ప్రాంతం ఇదే. ఇక్కడి వ్యాపారాలపై ఇప్పటికీ 2022 ఘర్షణ ప్రభావాలున్నాయి.

భారత సంతతికి చెందిన ఇమ్రాన్ పఠాన్ ఇక్కడ వివాహ దుస్తుల దుకాణాన్ని నడుపుతున్నారు.

"ఆ ఘర్షణ తరువాత వ్యాపారం కొద్దిగా దెబ్బతింది. ఇక్కడికి వచ్చే ముందు అంతా బాగానే ఉందా అని జనం ఆలోచించే విధంగా ఇది ప్రభావితమైంది. ఇటీవల భారత్, పాకిస్తాన్ మధ్య టీ–20 మ్యాచ్ జరిగింది. అలాంటప్పుడు కొనుగోలుదారులు ఉదయమే వస్తారు, మేం మ్యాచ్ జరగడానికంటే ముందే పని ముగిస్తాం. వారి మనస్సులో కొంచెం భయం ఉంది, అది దూరమవడానికి కొంత సమయం పడుతుంది" అని అన్నారు.

బెల్‌గ్రేవ్ రోడ్‌లోని ఇమ్రాన్ దుకాణానికి కొద్ది అడుగుల దూరంలో భారత సంతతికి చెందిన రంజు మోదా కూడా దుస్తుల దుకాణాన్ని నడుపుతున్నారు.

"ఇలాంటిది జరుగుతుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. గత రెండేళ్లుగా వ్యాపారం తగ్గింది. నగరం వెలుపల నుంచి వచ్చే మా దక్షిణాసియా కస్టమర్లు తగ్గారు. ఎందుకంటే ఈ సంఘటనలన్నీ మీడియాలో కనిపించడంతో ఈ వ్యాపారం బాగా ప్రభావితమైంది" అని అన్నారు రంజు మోదా.

గత కొన్నేళ్లుగా లీస్టర్‌లోని కొన్ని వీధుల్లో హిందువులు, మరికొన్ని ప్రాంతాలలో ముస్లింలు మెజారిటీగా ఉంటున్నారు. అలాంటి ప్రాంతమే ఎవింగ్టన్ రోడ్. ఇక్కడ పెద్ద మసీదు ఉంది.

బెల్‌గ్రేవ్ రోడ్ ప్రాంతంలో హిందువులు ఎక్కువగా నివసిస్తున్నారని హై ఫీల్డ్స్, ఎవింగ్టన్ రోడ్ వంటి ప్రాంతాల్లో ముస్లింలు ఎక్కువగా నివసిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

రెండు వర్గాల మధ్య ఉన్న టెన్షన్ కారణంగా ఒక్కోసారి ఒక వర్గం ఆధిపత్యం ఉన్న ప్రాంతాలకు వెళ్లేందుకు మరో వర్గం వారు సంకోచిస్తుంటారని కొందరు అంటున్నారు.

హిందూ వర్సెస్ ముస్లిం

2022లో జరిగిన సంఘటనలకు రెండు వర్గాలూ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. –లీస్టర్‌లో నివసించే మొహమ్మద్ ఒవైస్ యూకే ఇండియన్ ముస్లిం కౌన్సిల్ డైరెక్టర్.–"ముస్లిం సమాజం నిరంతరం బెదిరింపులకు గురవుతోంది. ప్రపంచ హిందూత్వ ఉద్యమం ద్వారా ముస్లిం జనాభాకు కోపం తెప్పించే వ్యూహాత్మక లక్ష్యం ఇక్కడ ఉందని మేం నమ్ముతున్నాం" అని అన్నారు. అల్లర్లకు ముందు మతపరమైన సోదరభావం ఉందని ఒవైస్ అంటున్నారు.–"వారు తిరిగి రావాలని మేమూ కోరుకుంటున్నాం. లీస్టర్‌లోని చాలామంది హిందువులు శాంతిని కోరుకుంటున్నారు. ముస్లింలు, సిక్కులులతో హిందువులు సోదరభావంతో ఉంటారని మేమూ నమ్ముతున్నాం" అని ఆయన అన్నారు.'ప్రజలు మరిచిపోలేదు'

# తెలుగు రాష్ట్రాల సమస్యలపై చిత్తశుద్ధి చాటాలి

హైదరాబాద్,తెలంగాణకు రెండు, ఎపికి ఒక కేంద్రమంత్రి పదవి దక్కింది. బిజెపికి చెందిన ఈ ముగ్గురూ బాధ్యతగా మాట్లాడడంతో పాటు పనిచేయాల్సి ఉంది. అలాగే టిడిపి నుంచి మరో ఇద్దరు మంత్రులు ఉన్నారు. మొత్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఐదుగురు మంత్రులు ఉన్నారు. వీరంతా విభజిత ఎపికి ఎంతమేరకు కృషి చేస్తారన్నది ముఖ్యం. రాజకీయాలు, రాజకీయ విమర్శలు పక్కన పెట్టి ముందుకు పోవాల్సిన అసవరం ఉంది. అలాగే తెలంగాణతో పాటు ఎపికి ఇచ్చిన హామీల విషయంలో బిజెపి అగ్రనాయకత్వం ఆత్మపరిశీలన చేసుకోవాలి. విభజన హామీల్లో చాలా వరకు నెరవేరలేదు. అలాగే వాటిని నాన్చివేస్తూ మెల్లగా పక్కన పెడుతూ వచ్చారు. బిజెపిలో గతంతో పోలిస్తే బాగా పరివర్తన వచ్చింది. గతంలో నీతి,నిజాయితీలకు పెద్దపీట వేసేవారు. ఇప్పుడా అవకాశం ఇసుమంత కూడా నాయకత్వంలో లేదు. అధికారమే పరమావధి అన్న నీతిలో సిద్ధాంతాలను సృష్టించుకున్నారు. వాటిచుట్టే పరిభ్రమిస్తున్నారు. చేసింది చిన్నపనయినా అతిశయం జోడించి ఆహా...ఓహో అన్న రీతిలో సాగుతున్నారు. ఈ క్రమంలో చేసిందే చెప్పాలి. చెప్పిందే చేయాలి. ఏదైనా చేయకపోతే ఎందుకు చేయలేదో చెప్పాలి. నాయకత్వం తన సచ్ఛీలతను చాటుకోవాలి. నోట్లరద్దు,జిఎస్టీ, పెట్రో బాదుడు వల్ల కలుగుతున్న దుష్ఫలితాలను చర్చించాలి. చర్చకు అవకాశం ఇవ్వాలి. ప్రజాభీష్టం మేరకు నడుచు కోవాలి. అప్పుడే సమావేశాలకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రజల్లో ఉన్న నిరసనలను, అసంతృప్తులను పక్కన పెట్టి అతిశయాలను ప్రచారం చేసుకోవడం.. సరికాదు. అలాగే నాటి ఎన్డీఎ కన్వీనర్‌గా ఉన్న చంద్రబాబు ఇప్పుడు ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్నారు. ఆయన కూడా విభజన సమస్యలతో పాటు అనేక సమస్యల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించాల్సి ఉంది. ఇకపోతే రాజకీయ ఎజెండాతో బిజెపి కార్యక్రమాలు సాగుతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసు కునే ప్రయత్నం చేయాలి. ప్రజల జీవనస్థితిగతులను పరిశీలించాలి. అలాకాకుండా పైన నిర్ణయాలు ప్రకటించి అమలు చేయడం ద్వారా ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో కూడా తెలుసుకోవాలి. కేవలం ఎదుటి పార్టీలను విమర్శించడమే రాజకీయం కాదు. ముఖ్యంగా తెలంగాణలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అదేపనిగా కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారే తప్ప బిఆర్ఎస్ చేసిన తప్పులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పడం లేదు. ఇన్ని ఏళ్లలో బీజేపీ ఎన్నో ఉత్థాన పతనాలను చూసింది. అలాగే, బీజేపీ రాజకీయాలూ ఎంతో మారాయి. అప్పట్లో అయోధ్య, కాశీ, మధుర, కశ్మీర్‌లో 370 అధికరణ రద్దు ఎజెండాగా ఉన్నాయి. అయోధ్యలో ఆలయ నిర్మాణాన్ని మోదీ సాకారం చేశారు. కశ్మీర్‌లో అధికరణ 370ని రద్దు చేశారు. కాశీ, మధురలకు ప్రాధాన్యం లభించింది. ఇవే తాము సాధించిన విజయాలుగా ప్రచారం చేసుకుంటున్నారు. కానీ ఇవి పరిష్కారం చేయడంతో పాటు ప్రజల సమస్యలను ఎజెండాగా తీసుకోవాలి. తెలంగాణతో పాటు ఎపికి ఎలాంటి ప్రాధాన్యం ఇచ్చారో చెప్పాలి. ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలి.అందుకే బిజెపి నేతలు ఆత్మపరిశీల నకే ప్రాధాన్యం ఇవ్వాలి. యూపీఏ పదేళ్ల హయాంలో జరిగిన అవినీతి కుంభకోణాలు, ఆరోపణలు, జనాందోళనలు మోదీకి అనుకూలంగా మారాయి. 2014లో పార్టీ అధికారంలోకి వచ్చింది. 2019లో పార్టీని రెండోసారి అధికారంలోకి తీసుకొచ్చిన మోదీ.. ఇప్పుడు మూడోసారి ఎన్‌డిఎను అధికారంలోకి తీసుకుని రాగలిగారు. ఇప్పుడు ప్రజలు ఓ రకమైన హెచ్చరిక చేస్తూ అధికారం కట్టబెట్టారు. బీజేపీలోకి కొత్త రక్తం, కొత్త తరం వచ్చింద నడానికి ఈ మార్పులే ఉదాహరణ. ఈ క్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సమస్యలపై సమీక్షలు చేయాలి. ప్రజల నుంచి సమచారాం తెప్పించుకోవాలి. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య కేంద్రమంత్రులు వారధిగా నిలవాలి. అప్పుడే ప్రజలు కూడా నమ్ముతారు.

## అత్యంత ప్రతిష్టాత్మకంగా తెలంగాణ భవన్

హైదరాబాద్,ఎన్నికల హడావిడి ముగియడంతో ఇక పాలనపై సిఎం రేవంత్, ఆయన మంత్రులు దృష్టి సారించారు. ఇప్పటికే ఢిల్లీలో మాకం వేసి కేంద్రమంత్రులతో పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై చర్చించారు. వరుసగా కేంద్రమంత్రులతో సంప్రదించారు. ఈ క్రమంలో రోడ్లు,తదితర పనులకు సంబంధించి స్పష్టమైన హామీని పొందారు. అలాగే ఢిల్లీలో తెలంగా భవన్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మించాలని సిఎం రేవంత్ పట్టుదలగా ఉన్నారు. ఢిల్లీలో కొత్తగా నిర్మించనున్న తెలంగాణ భవన్‌ను 'అన్ని వసతులతో అత్యంత ఆధునికంగా నిర్మించేందుకు కార్యాచరణ చేపట్టారు. ఈ విషయంలో రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటర్ రెడ్డి అధికారులతో వరుస సమీక్షలు చేపట్టారు. అవసరమైతే తెలంగాణ భవన్ నిర్మాణానన్ని పేరున్న కాంట్రాక్టరలకు అప్పగించే ఆలోచన కూడా చేస్తున్నట్లు తెలిసింది. ఢిల్లీలో బహుళ అంతస్థులతో నిర్మించనున్న తెలంగాణ భవన్‌లో వాణిజ్య కార్యకలాపాలను అనుమతించాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేటు డెవలపర్‌కు అప్పగించాలని భావిస్తున్నట్టు ఉన్నతస్థాయి వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర అవసరాలకు కావాల్సినన్ని గదులు రాష్ట్రానికి ఇచ్చి మిగిలినదాంట్లో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించుకునేలా అనుమతించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇందులో భాగంగా స్టార్ హోటళ్లతో సంప్రదింపులు జరుపుతున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఇదే జరిగితే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణ భవన్ రూపుదిద్దుకోనుంది. ఇందులో తెలంగాణ నుంచి వెళ్లే సిఎం, మంత్రులు, అధికారులు, రాజకీయ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, తదితరులకు వసతి కల్పించేలా నిర్మాణాలు చేయాలని సంకల్పించారు. గతంలో ఉమ్మడి ఎపిలో ఎపి భవన్ ఇలాగే వసతులు కల్పించేది. ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌ను ఏపీ, తెలంగాణల మధ్య గత మార్చిలో విభజించారు. మొత్తం 19.781 ఎకరాల విస్తీర్ణంలో ఏపీకి 11.536 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు సమకూరాయి. ఈ మొత్తం ఆస్తి విలువ రూ.9,913.505 కోట్లుగా కేంద్ర హోంశాఖ ప్రకటించింది. తెలంగాణకు వచ్చిన వాటాకు వచ్చిన మూడెకరాల్లో శబరి బ్లాక్ ఉండగా, 5.245 ఎకరాల్లో పటౌడీ హౌస్ ఉంది. శబరి బ్లాక్ ఉన్న ప్రాంతంలో గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర క్యాబినెట్ మంత్రులకు విడివిడిగా బ్లాక్‌లు నిర్మించాలని, మిగిలిన 5.245ఎకరాల్లో రాష్ట్ర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు, అధికారులు వెళ్లినప్పుడు ఉండేలా గదులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది. టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం ఇక్కడ బహుళ అంతస్థులు నిర్మించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఆర్అండ్‌బీ అధికారులు రెండు–మూడు నమూనాలను రూపొందించారు. 24 అంతస్థులతో తెలంగాణ టవర్‌ను నిర్మించనున్నట్టు ఇటీవలే రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. అయితే ఈ భవనాల నిర్మాణానికి దాదాపు రూ. 500 కోట్లకుపైగా ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. నిధుల కొరత ఉన్నందున ప్రైవేట్ డెవలపర్స్‌కు నిర్మాణ పనులు అప్పగించి పూర్తి చేయించే ఆలోచనలో కూడా ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా సూట్‌లను, గదులను నిర్మించడంతో పాటు, మెయింటెనెన్స్ కోసం కొంత స్థలంలో వాణిజ్య సముదాయం కూడా నిర్మించే ఆలోచన చేస్తున్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉండగా దీని గురించి ఎక్కగా ఆలోచన చేయలేదు. స్థలాన్ని పంచుకోవాలన్న శ్రద్ద కూడా పెట్టలేదు.

# అధికార బీజేపీని ఏకి పారేసిన విపక్షనేత రాహుల్

న్యూఢిల్లీ,లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగంపై రచ్చ రాజుకుంది. లోక్ సభలో ప్రతిపక్ష నేతగా తన తొలి ప్రసంగంతోనే బీజేపీపై పదునైన విమర్శనాస్త్రాలు సంధించారు. బీజేపీని, ప్రధాని మోదీని టార్గెట్ చేస్తూ రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. శివుడి నుంచి తాను ప్రేరణ పొందానని , శివుడి ఫోటోను రాహుల్ గాంధీ లోక్‌సభలో చూపించారు. అయితే స్పీకర్ అభ్యంతరం తెలిపారు. శివుడి ఫోటోను చూపిస్తే తప్పేముందు..? అని రాహుల్ ప్రశ్నించారు. శివుడు శాంతికి ప్రతీక, హింసకు వ్యతిరేకమని.. బీజేపీ హిందువులకు వ్యతిరేకమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు రాహుల్. భగవాన్ శివుడి నుంచి తాను ప్రేరణ పొందినట్టు తెలిపారు. దేశమంతా ఏకమై రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేసిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్ అనే భావన, రాజ్యాంగంతోపాటు భాజపా ఆలోచనలను ప్రతిఘటించిన లక్షలాదిమందిపై గత పదేళ్లలో క్రమపద్ధతిలో దాడి జరిగిందని ఆరోపించారు. తానూ బాధితుడినేనని.. తనపై 20కిపైగా కేసులు మోపారన్నారు. నాకు రెండేళ్ల జైలుశిక్ష పడింది. నా ఇల్లు తీసేసుకున్నారు. ఈడీ అధ్వర్యంలో 55 గంటల పాటు విచారణ ఎదుర్కొన్నా అని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై చర్చలో భాగంగా రాహుల్ ప్రసంగించారు. ప్రతిపక్షంలో ఉండటం గర్వంగా, సంతోషంగా ఉ ందని పేర్కొంటూ.. అధికారంలో కంటే ఇదే ఎక్కువ విలువైనది, ఇందులో 'సత్యం' ఉందని తెలిపారు. అయితే కాంగ్రెస్ ఎంపీ మాట్లాడుతుండగా ప్రధాని సహా భాజపా ఎంపీలు పదే పదే అభ్యంతరం తెలపడం గమనార్హం. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్, భాజపాపై విమర్శలు గుప్పించిన రాహుల్ గాంధీ.. సభలో కొన్ని ఫొటోలను చూపించారు. దీనిపై అధికార పక్షం నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. సభలో ఇలాంటి మతపరమైన ఫొటోల ప్రదర్శనకు నిబంధనలు అంగీకరించవని స్పీకర్ ఓం బిర్లా వారించారు. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలగజేసుకుని రాహుల్ వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపారు. హిందువులను హింసావాదులుగా రాహుల్ పేర్కొనడం ఆమోదనీయం కాదని దుయ్యబట్టారు. అటు కేంద్ర మంత్రి అమిత్ షా సైతం విపక్ష నేత క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఎమర్జెన్సీ, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లకు కారకులైన వారికి.. అహింస గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. అయితే.. తాను భాజపాను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశానని.. ఆ పార్టీ, ఆర్ఎస్ఎస్‌లే మొత్తం హిందూ సమాజం కాదని రాహుల్ తెలిపారు. అన్ని మతాలు ధైర్యం, నిర్భయత, అహింస సందేశాలను చాటి చెబుతున్నాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో నీట్, అగ్నివీర్‌ల ప్రస్తావన లేదు. ప్రొఫెషనల్ పరీక్ష అయిన 'నీట్'ను కమర్షియల్‌గా మార్చారు. గతంలో తీసుకొచ్చిన రైతు చట్టాల వల్ల 700 మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారు. వారికి సంతాపంగా సభలో మౌనం కూడా పాటించలేదు. భాజపా హయాంలో సంస్థలు నిర్వీర్యమయ్యాయి. దేవుడితో ప్రత్యక్షంగా మాట్లాడతానని స్వయంగా ప్రధాని చెప్పారు. భాజపా ప్రభుత్వం.. జమ్మూకశ్మీర్‌ను రెండు ముక్కలు చేసింది. అల్లర్లతో మణిపుర్ అట్టుడికి పోయినా.. ఇప్పటివరకు ప్రధాని వెళ్లలేదు. అక్కడ నా కళ్లముందే పిల్లలపై బుల్లెట్ల వర్షం కురిసింది. నోట్ల రద్దు వల్ల యువత ఉపాధి కోల్పోయింది. జీఎస్టీ వల్ల వ్యాపారులు, ప్రజలు అనేక బాధలు పడ్డారు. వీటి వల్ల దేశప్రజలకు కలిగిన లాభం ఏంటని విపక్షనేత రాహుల్ ప్రశ్నించారు. హిందుత్వ పేరుతో దేశ ప్రజలను బీజేపీ భయపెడుతోందని మండిపడ్డారు. మోదీ మణిపూర్ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. మణిపూర్‌లో అంతర్యుద్ధం జరుగుతోందన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను గాలికొదిలేశారని పేర్కొన్నారు. బడా పారిశ్రామికవేత్తల కోసమే పనిచేస్తున్నారని ఫైర్ అయ్యారు. తాను దేవుడితో నేరుగా మాట్లాడతానని మోదీ చెప్పారు.. నోట్ల రద్దు చేయాలని దేవుడే మోదీకి చెప్పి ఉంటారంటూ రాహుల్ పేర్కొన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను సర్వనాశనం చేశారని.. ఉద్యోగాలు లేక యువత అల్లాడుతోందన్నారు. అగ్నివీర్ పథకంపై తీవ్ర విమర్శలు చేశారు. అగ్నివీర్ జవాన్లు యుద్ధంలో చనిపోతే అమర జవాన్ హోదా లభించదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామన్నారు. ఈ సారి గుజరాత్ లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని.. రాసిపెట్టుకోండంటూ రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రైతులను పట్టించుకోలేదని.. 700 మంది చనిపోయారని తెలిపారు. అయోధ్యలో భూముల్ని లాక్కొని విమానాశ్రయం నిర్మించారంటూ ఆరోపించారు. అయోధ్య బీజేపీ సొత్తు కాదని,.. ఇదే అంశాన్ని ప్రజలు ఎన్నికల్లో ప్రూవ్ చేసారని అన్నారు. అయోధ్యలో ప్రజల్ని మందిరం దగ్గరకు కూడా రానివ్వలేదని మండిపడ్డారు. అయోధ్య ఓపెనింగ్ కి కార్పొరేట్ పెద్దలను మాత్రమే ఆహ్వానించారని అన్నారు.అక్కడ అంబానీ, అదానీలు మాత్రమే ఉన్నారని అన్నారు. రామజన్మ భూమి బీజేపీకి మాత్రమే సొంతం కాదని ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు. మోదీ వారణాసిలో బతికి బయటపడ్డారని అన్నారు. హిందూ సమాజం అంటే బీజేపీ, ఆర్ఎస్సెస్ మాత్రమే కాదని అన్నారు. హిందూ సమాజం అంటే ఒక్క మోడీనే కాదని, సభలో ఉన్నవారు, బయట ఉన్నవారంతా హిందువులే అని అన్నారు. కాగా.. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలకు బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. తన మైక్‌ను ఎందుకు కట్ చేస్తున్నారని రాహుల్ ప్రశ్నించారు. రాహుల్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ , అమిత్‌షా మండిపడ్డారు. దేశ ప్రజలను ఎమ్జర్గ÷న్సీ పేరుతో జైల్లో పెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు అమిత్‌షా. సిక్కుల ఊచకోతను మర్చిపోయారా అని రాహుల్‌ను ప్రశ్నించారు. రాహుల్ తన వ్యాఖ్యలకు దేశ ప్రజలకు , హిందువులకు క్షమాపణ చెప్పాలన్నారు.రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీలు అభ్యంతరం తెలిపారు.. రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ ఎంపీ దూబే స్పీకర్ ను కోరారు.

# నీట్, నీట్ యూజిసి పరీక్షలన్నీ లీకులే

న్యూఢిల్లీ,ప్రధాని నరేంద్ర మోడీ ఒకప్పుడు పొత్తులను అపహాస్యం చేశారని, ఇప్పుడు అదే పొత్తులపైనే ఆధారపడ్డారని ఎఐసిసి ప్రెసిడెంట్, ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే చురకలంటించారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ఖర్గే మాట్లాడారు. మోడీ సినిమాలో అన్ని లీకేజీలే ఉన్నాయని, నీట్ యూజీ లీక్ చేశారని, నీట్ పిజి రద్దు చేశారని, అయోధ్య రామాలయం పైకప్పు నుంచి వర్షపు నీరు లీక్ అయ్యిందని దుయ్యబట్టారు. ఏటా 20 లక్షల ఉద్యోగాల మాట హామీ ఏమైందని, మోడీ ఎన్నికల ప్రచారంలో అబద్దాలు చెప్పడంతో పాటు కుల, మత, భాషా పరంగా ప్రజలను రెచ్చగొట్టారని ధ్వజమెత్తారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు 200కు పైగా ప్రసంగాలు ఇచ్చారని, మోడీ 117 ఎన్నికల ప్రచార సభలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, కానీ ఇసి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు విపక్షాల అకౌంట్లు ఫ్రీజ్ చేశారని, విపక్షాల ప్రచారాన్ని ఎన్నో రకాలుగా అడ్డుకున్నారని, విపక్షాలను అణగదొక్కడం మోడీకి అలవాటుగా మారిందని ఖర్గే మండిపడ్డారు. చందా దేవో దందా ఖరో మోడీ సర్కార్ నినాదంగా మారిందని, ఇడి, సిబిఐ, ఐటిని ఇష్టం వచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం వాడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వాలు పడగొట్టడం నేతలను కొనడం కామన్‌గా మారిందని, ప్రభుత్వాలను పడగొట్టడం ప్రజాస్వామ్యానికి అవమానం కాదా? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, గోవా, మణిపూర్‌లలో ప్రభుత్వాలను పడగొట్టారని, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని, కేజ్రీవాల్‌కు ఒక కేసులో బెయిల్ వస్తే మరో కేసులో అరెస్ట్ చేశారని, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు.

# ప్రతిపక్షాల గొంతునొక్కేందుకే కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం




న్యూఢిల్లీ : ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. అందుకోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందని ప్రతిపక్ష ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలపై మోడీ ప్రభుత్వ వ్యవహారశైలికి నిరసనగా సోమవారం పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఇండియా వేదికకు చెందిన ఎంపీలు ఆందోళన చేశారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు హోరెత్తించారు. ప్రతిపక్షాలను మాట్లాడకుండా చేయడం కోసం.. వారిపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం ఆపాలని మోడీ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అవినీతి చేసిన వారు బిజెపిలో చేరితే, వారికి అవినీతి చేసుకునేందుకు లైసెన్స్ ఇస్తోందని వారు. ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ఇండియా వేదిక నేతలు ఉన్నారు.

లోక్‌సభలో నీట్‌పై చర్చకు పట్టు

లోక్‌సభ సమావేశాలు ఐదోరోజు వాడీవేడిగా కొనసాగుతున్నాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే టి-20 ప్రపంచ కప్ గెలుపొందిన టీం ఇండియాకు ఎంపీలంతా అభినందనలు తెలిపారు. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే నేతపై చర్చను ప్రారంభించేందుకు అధికార పార్టీ అనురాగ్ ఠాకూర్‌ను స్పీకర్ ఓం బిర్లా పిలిచారు. లోక్‌సభ ప్రతి పక్ష నేత రాహుల్‌గాంధీ సభలో నీట్ అవకతవకల గురించి ప్రస్తావించారు. ఈ అంశంపై చర్చ జరపాలని పట్టుబట్టారు. ఈ విషయంపై తాము వాయిదా తీర్మానం కూడా ఇచ్చినట్లు చెప్పారు. నీట్ అంశంపై చర్చ చేపట్టాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అందుకు స్పీకర్ ఓం బిర్లా నిరాకరించడంతో సభ నుంచి ప్రతిపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'మేము నీట్‌పై ఒక్కరోజు మొత్తం చర్చను కోరుతున్నాము. ఇది చాలా ముఖ్యమైన అంశం. పేపర్ లీక్‌ల వల్ల రెండుకోట్ల మందికిపైగా విద్యార్థులు ప్రభావితులయ్యారు. 70 సందర్భాల్లో పేపర్ లీక్‌లు జరిగాయి. ఈ విషయంలో విద్యార్థులు తా ఆందోళనలో ఉన్నారు. వారికి పార్లమెంట్ నుంచి భరోసా కల్పిస్తూ సందేశాన్ని ఇవ్వాల్సి ఉంది. మీరు ఈ అంశంపై ప్రత్యేక చర్చకు అనుమతిస్తే మేం సంతోషిస్తాం' అని రాహుల్ గాంధీ అన్నారు.రాహుల్ అభ్యర్థనను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వ్యతిరేకించారు. ఆ అంశంపై నోటీసు ఇవ్వబడింది, బిఎసిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే సమయంలో వాయిదా తీర్మానాలు తీసుకునేందుకు నిబంధనలు అంగీకరించవని అన్నారు. ప్రస్తుత సమావేశాల్లో జీరో అవర్, ప్రశ్నోత్తరాలు లేవని చెప్పారు. ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చిద్దామని రాష్ట్రపతి ప్రకటించారు. తీర్మానాన్ని ఆమోదించిన తరువాత ఇతర అంశాలు లేవనెత్తవచ్చున్న ప్రతిపక్షాల అభ్యర్థనను ఓం బిర్లా తిరస్కరించారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా ఇదే పరిశీలించారు. ప్రతిపక్షాలు కోరుతున్న అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎప్పుడు ఏ అంశాన్ని చర్చించాలంటే దానిపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉ ంటుందన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రస్తుత చర్చను కొనసాగించాలని రాజ్‌నాథ్ నిర్ణయించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభ ముగింపు వరకు ప్రత్యేక చర్చ జరగదని చెప్పారు. దీంతో సభ నుంచి ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

# విభజన సమస్యలపై కూర్చుని మాట్లాడుకుందాం


అమరావతి, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలపై చర్చించేందుకు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేద్దామంటూ ఎపి సిఎం చంద్రబాబు ప్రతిపాదించారు. రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారం, ఇరు రాష్ట్రాల పురోగతి, రాష్ట్రాల మధ్య సహకారం అంశాలపై రేవంత్ రెడ్డితో కలిసి పని చేసేందుకు తాను ఎదురుచూస్తుంటానంటూ చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలకమైన లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా మీరు చేస్తున్న విశేషమైన కృషికి అభినందనలు తెలియజేస్తున్నాను. మీ అంకితభావం, నాయకత్వం తెలంగాణ పురోగతి, అభివృద్ధికి గొప్ప సహకారం అందిస్తున్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయాక ఏర్పడ్డ విభజన సమస్యలను పరిష్కరించు కోవడం కోసం లేఖ రాసినట్లు చంద్రబాబు తెలిపారు. తెలుగురాష్ట్రాల ప్రయోజనం కోసం విభజన సమస్యల పరిష్కారం దిశగా సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. తద్వారా విభజన సమస్యలపై చర్చించుకుందామని.. పొరుగు రాష్ట్రాలుగా పరస్పర సహకారాలు అందించుకుందామని చంద్రబాబు తెలిపారు. తనదైన ముద్ర వేస్తూ పరిపాలన సాగిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు. మీ చిత్తశుద్ధి, నాయకత్వ పటిమ తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయి. తెలుగు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా ఉన్న మనం రెండు రాష్ట్రాల సమగ్ర, సుస్థిర అభివృద్ధి కోసం పరస్పరం సహకారం అందించుకోవాలి. ఇప్పటికే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి 10 ఏళ్లు గడిచాయి. పునర్విభజన చట్టం ప్రకారం ఇంకా ఎన్నో సమస్యలు పరిష్కారం కావాల్సి ఉండగా అవన్నీ ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోయాయి. వాటి కారణంగా మన రెండు రాష్ట్రాల్లో సంక్షేమం, ఇతర అంశాలకు అడ్డంకిగా మారుతోంది. వీటన్నింటిని మనం కూర్చొని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసం జూలై 6న శనివారం మధ్యాహ్నం మీ ప్రాంతంలో సమావేశం ఏర్పాటు చేసుకొందామని నేను ప్రతిపాదిస్తున్నాను. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న కీలకమైన సమస్యలు ఇలా ముఖాముఖి సమావేశంలో కూర్చొని చర్చించుకుంటేనే పరిష్కారం అవుతాయి. ఇరు రాష్ట్రాలకు లబ్ధికలిగే విధంగా పరస్పరం సహకరించుకోవాలి. మన భేటీ సత్ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నాను' అని చంద్రబాబు లేఖలో రాశారు.

# సడన్ గా మోదీకి వెంకయ్యనాయుడుపై అంత ప్రేమ కోసం పుట్టుకొచ్చిందో..!!

న్యూఢిల్లీ,మాజీ రాష్ట్రపతి క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు. అలాంటిది ఆయనను ప్రధాని మోదీ ఇంతలా ఎందుకు ప్రసన్నం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఇవాళ వెంకయ్య పుట్టినరోజున ఏకంగా పెద్ద వ్యాసమే రాసుకొచ్చారు మోదీ... ఇంత ప్రేమ ఎందుకబ్బా..!! వెంకయ్య నాయుడు ఎకెపికి ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారుముప్పవరపు వెంకయ్యనాయుడు... రాజకీయాల గురించి తెలిసిన ప్రతిఒక్కరికి ఈ పేరు సుపరిచితమే. ఇక తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియనివారుండరు. సామాన్య విద్యార్థి నాయకుడి నుండి అంచెలంచెలుగా ఎదిగి చివరకు కేంద్ర మంత్రిగా, దేశ ఉపరాష్ట్రపతిగా అత్యున్నత పదవిని అధిరోహించిన తెలుగుబిడ్డ వెంకయ్యనాయుడు. తన వాగ్దాటికి ప్రత్యర్థులను సైతం మెప్పించగల సమర్థుడు వెంకయ్యనాయుడు... ఆయన రాజకీయాలకు కాదు ప్రాసలతో కూడిన స్పీచులకు అభిమానులు వున్నారంటే అతిశయోక్తి కాదు.విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ మంచి నేతగా పేరుతెచ్చుకున్న వెంకయ్య వ్యక్తిగతంగా మంచిపేరు సంపాదించుకున్నారు. (జూలై 1 సోమవారం) వెంకయ్యనాయుడు పుట్టినరోజు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో సహా పలువురు కేంద్రమంత్రులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ ప్రముఖులు ఆయనకు భర్త డే విశేషాలు తెలిపారు. మోదీ అయితే బిజెపి విద్యార్థి విభాగం ఏబివిపి నుండి ఉపరాష్ట్రపతి వరకు వెంకయ్య రాజకీయ ప్రస్థానం గురించి పెద్ద వ్యాసమే రాసారు. ఇలా వెంకయ్యనాయుడిని పుట్టినరోజు సందర్భంగా పొగడ్తలతో ముంచెత్తారు ప్రధాని మోదీ. అయితే వెంకయ్యనాయుడు ప్రస్తుతం యాక్టివ్ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అటల్ బిహారీ వాజ్ పేయి కేబినెట్ లో గ్రామీణాభివృద్ధి, మోదీ కేబినెట్ లోనూ పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. ఇలా కేంద్రమంత్రిగా కొనసాగుతున్న వెంకయ్యను 2017లో దేశ ఉపరాష్ట్రపతిగా నియమించడంతో క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు. 2022 లో ఉపరాష్ట్రపతి పదవీకాలం ముగిసిన తర్వాత రాజకీయాలకు దూరంగా వ్యక్తిగత జీవితం గడుపుతోంది.

వెంకయ్యనాయుడు రాజకీయాలకు దూరమయ్యారా..? దూరం చేసారా..?

భారతీయ జనతాపార్టీలో అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటివారి వయసు కాకపోయిన రాజకీయంగా వారితో సమకాలీకులు వెంకయ్యనాయుడు.ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో వెంకయ్య కేంద్ర మంత్రి. అంటే జాతీయ రాజకీయాల్లో మోదీ, అమిత్ షా ల కంటే వెంకయ్యనాయుడు సీనియర్. ఇదే ఆయనను రాజకీయాలకు దూరం చేసిందనేని విశ్లేషకుల అభిప్రాయం. మోదీ, అమిత్ షా ల శకం మొదలయ్యాక సీనియర్ నాయకులను దేశంలో పక్కనబెట్టడం ప్రారంభమయ్యింది. వయసు మీదపడిన వారిని రాజకీయాల నుండి తప్పిస్తూ కొత్తవారికి అవకాశం ఇవ్వడానికి సాంప్రదాయం ప్రారంభించింది. ఇలా 75 ఏళ్ల వయసు దాటిందని అద్వానీ వంటివారిని పక్కనబెట్టేసారు. కానీ వెంకయ్యనాయుడు విషయంలో అలా కాదు. వయసు కాకుండా రాజ్యాంగబద్ధమైన పదవి పేరుతో ఆయనను క్రియాశీల రాజకీయాలకు దూరం చేసారనే అనుమానాలు ఉన్నాయి. కావాలనే వెంకయ్యనాయుడు పక్కనబెట్టారనే ప్రచారమూ రాజకీయాల్లోనే కాదు తెలుగు ప్రజల్లోనూ సాగింది. తెలుగు రాష్ట్రాల నుండి నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతి తర్వాత పదవికి సరిపడా అర్హతలు, అనుభవం వెంకయ్యనాయుడు వున్నాయి. దీంతో ఆయనకు ఉపరాష్ట్రపతి నుండి రాష్ట్రపతిగా ప్రమోషన్ దక్కుతుందని అందరూ భావించారు. కానీ అనూహ్యంగా ఆయనను కాదని ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేసింది బిజెపి ప్రతిపక్షని ఎన్డిఏ కూటమి. ఉపరాష్ట్రపతిగా కూడా



ఆయనను మరోసారి కొనసాగించలేదు. ఇలా కావాలనే వెంకయ్యనాయుడును అవమానకరంగా రాజకీయాల నుండి దూరం చేసారనే ప్రచారం వుంది.

ఇప్పుడెందుకు వెంకయ్యపై మోదీ అంత ప్రేమ చూపిస్తున్నారు..?

ఉపరాష్ట్రపతి పదవీకాలం ముగిసిన తర్వాత వెంకయ్యనాయుడు ఫ్యామిలీ మ్యాన్‌గా మారిపోయారు. రాజకీయాలను పూర్తిగా దూరం పెట్టి హాయిగా కుటుంబంతో జీవిస్తున్నారు. బిజెపి వాళ్లు కూడా ఆయనను దాదాపు మరిచిపోయారు. అయితే పరిస్థితులన్నీ ఒకేలా వుండవు... ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవుతుంటాయి... రాజకీయాల్లో ఇది మరీ ఎక్కువగా జరుగుతుంటుంది. ఇలాగే వెంకయ్యనాయుడును రాజకీయాలకు దూరం చేసినవారికే ఇప్పుడాయన అవసరం పడింది. అందువల్లే ఆయనను బిజెపి అక్కున చేర్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ వెంకయ్యనాయుడుకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నారు. మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మోదీ స్వయంగా వెంకయ్య ఇంటికి వెళ్లి కలిసారు. అంతకుముందు చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం కార్యక్రమంలోనూ వెంకయ్యను ఆత్మీయంగా పలకరించారు. ఇక ఇవాళ అంటే వెంకయ్య పుట్టినరోజున ఆయనపై పెద్ద వ్యాసమే రాస్తూ ప్రశంసలతో ముంచెత్తారు ప్రధాని మోదీ. అయితే బిజెపి వెంకయ్యనాయుడు జపం చేయడంవెనక రాజకీయాలు దాగివున్నాయన్నది అర్థమవుతోంది. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బిజెపికి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే మెజారిటీ రాలేదు... అందుకే ఏ మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన తెలుగుదేశం పార్టీ పాత్ర చాలా కీలకమైనది... బిజెపి తర్వాత ఎండిఏలో అత్యధిక ఎంపీ సీట్లు కలిగిన పార్టీ టిడిపి. కాబట్టి ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి ప్రసన్నం చేసుకోవడం చాలా బిజెపికి చాలా ముఖ్యం. ఇదే ఇప్పుడు వెంకయ్యనాయుడిని బిజెపి తెరపైకి తీసుకురావడానికి కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వెంకయ్యనాయుడు తెలుగు రాజకీయాలపై మరీముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాలపై మంచి పట్టుంది. ఇంకా చంద్రబాబు నాయుడుతో సత్సంబంధాలు వున్నాయి. గతంలో వెంకయ్య కేంద్రమంత్రిగా వుండగా ఏపీకి బారీ నిధులు కేటాయించారు... అలాగే కొత్తగా ఏర్పడిన చంద్రబాబు సర్కార్ కు అండదండగా వున్నారు. కాబట్టి ప్రస్తుతం బిజెపి, టిడిపి కి మధ్య వెంకయ్య వారధిగా ఉపయోగించాలన్నది మోదీ ప్లాన్ గా కనిపిస్తోంది. అందువల్లే ప్రధాని మోదీ తమ సీనియర్ వెంకయ్యనాయుడును ప్రసన్నం చేసుకునే పనిలో వున్నారనేది రాజకీయ పండితుల మాట. నిజంగా అంత ప్రేముందా లేక రాజకీయాల కోసమే చేసారా తెలీదుగానీ వెంకయ్యనాయుడు పుట్టినరోజున ప్రధాని మోదీ రాసిన వ్యాసం అందరినీ ఆకట్టుకుంటోంది...మరీముఖంగా తెలుగువారికి మరింత ఆనందాన్నిచ్చింది.

# విపత్తుల నిర్వహణ ఇక హైడ్రాగా మార్పు

హైదరాబాద్,గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విపత్తుల నిర్వహణ విభాగానికి అత్యంత కీలక బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అనుగుణంగా వ్యవస్థాగత మార్పులతో పాటు, బాధ్యతల పంపిణీ జరగాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో సోమవారం సాయంత్రం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఎండీఏ, మూసీ డెవలప్మెంట్ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ భౌగోళిక పరిధిని విస్తరించనున్న దృష్ట్యా విపత్తుల నిర్వహణ విభాగం పరిధిని కూడా అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, దాని చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 గ్రామ పంచాయతీల వరకు ఈ విభాగం సేవలు అందించేందుకు అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. ఇకపై ఈ విభాగాన్ని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) అని పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నారు. డీఐజీ స్థాయి అధికారి ఈ విభాగానికి డైరెక్టర్గా, ఎస్పీ స్థాయి అధికారులు అడిషనల్ డైరెక్టర్లుగా ఉండేలా చూడాలని సీఎం చెప్పారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, వివిధ విభాగాల నుంచి ప్రత్యేక టీమ్లు ఈ విభాగంలో నియమించాలని సూచించారు. కేవలం వరదలు, ప్రమాదాలు సంభవించినప్పుడే కాకుండా ఇకపై విపత్తుల నిర్వహణ విభాగం సిటీ ప్రజలకు నిరంతరం సేవలు అందించేలా పునర్వవస్థీకరణ జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరంలో ప్రజలు ఎదుర్కనే సమస్యలన్నింటిలో హైడ్రా క్రియాశీలంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. దాదాపు రెండు వేల కిలోమీటర్ల జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న చెర్వులు, కుంటలను పరిరక్షించటం, సిటీలోని నాలాలు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురవకుండా కాపాడే కీలక బాధ్యతలను ఈ విభాగమే చేపట్టాలని నిర్ణయించారు. దీంతో పాటు హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగు నీటి పైపులైన్లు, విద్యుత్తు సరఫరా లైన్లు, డ్రైనేజీలు, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వ్యవహారాలన్నింటిలోనూ ఈ విభాగం సేవలను అందిస్తుంది. అందుకు వీలుగా ఈ విభాగం పునర్వ్యవస్థీకరణ, సిబ్బంది, విధులు, నిధుల కేటాయింపు, బాధ్యతలపై ముసాయిదా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. ÷జొసీ రివర్ డెవెలప్మెంట్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ సిటీకి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చేలా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. హైదరాబాద్ సిటీలోని చారిత్రక ప్రాధాన్యమున్న కట్టడాలు, శిథిలమైన నిర్మాణాలను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. సిటీ లైబ్రరీ, చార్మినార్ సమీపంలోని ఆయుర్వేద హాస్పిటల్, నిజామియా అబ్జర్వేటరీ, గుడిమల్కాపూర్ కోనేరు లాంటి వివిధ చారిత్రక ప్రదేశాలపై జీహెచ్‌ఎంసీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ను ప్రదర్శించింది. వాటిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న వివిధ మార్గాలను అన్వేషించాలని సీఎం సూచించారు. వీటిలో మూసీ రివర్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులో అనుసంధానం చేసేందుకు వీలైన వాటిని గుర్తించి, అందులోనే జోడించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ అడ్మినిస్టేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ అమ్రాపాలి, జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ విపత్తు నిర్వహణ కమిషనర్ ఏవీ రంగనాథ్, హైదరాబాద్ వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఖరీఫ్ కార్యాచరణపై ప్రత్యేక దృష్టిపెట్టండి

విజయవాడ, జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో ప్రత్యేకంగా దృష్టిసారించి సీజన్‌ను విజయవంతం చేసేలా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన ఆదేశించారు. ÷రిలిమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సృజన.. వ్యవసాయం, ఉద్యాన, పట్టు, పశుసంవర్ధక, మత్స్య శాఖలతో పాటు మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక అమలు, జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులు, భవిష్యత్తు అవసరాలు, విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు; సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ, పంట రుణాలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. జిల్లాలోని రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా సక్రమమైన కార్యాచరణ ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ సాగును విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. ఎరువులు, పురుగు మందుల వినియోగంపై రైతులకు సరైన విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో సాగుచేస్తున్న ఉద్యాన పంటలు, సాగు విస్తీర్ణం, దిగుబడులు, మార్కెటింగ్ అవకాశాలు తదితరాలపై చర్చించారు. రైతు బజార్ల కార్యకలాపాలపైనా సమీక్షించారు. ఉద్యాన శాఖ ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాలను కూడా సమీక్షించారు. పశుసంవర్ధక శాఖపై సమీక్ష చేస్తూ పశువులకు రోగనిరోధక టీకాలు, పశువుల దాణా, పశు బీమా, పశు సంచార ఆరోగ్య సేవా కేంద్రాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పట్టు, మత్స్య శాఖలకు సంబంధించి జిల్లాలోని కార్యకలాపాలపై కూడా కలెక్టర్ జి.సృజన సమీక్షించారు. వివిధ శాఖల పనితీరులో పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సృజన తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డా. ఎస్.నాగమణెమ్మ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. కె.విద్యా సాగర్, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, సెరికల్చర్ ఆఫీసర్ ఎన్.సత్యనారాయణ, మత్స్య శాఖ అధికారి పెద్దిరాజు, ఏపీఎంఐపీ పీడీ పి.ఎం.సుభానీ, ఏటీఎంఏ పీడీ యు.నరసింహరావు, మార్క్‌ఫెడ్ డీఎం కె.నాగమల్లిక, అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కె.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణం

విశాఖపట్నం,ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. విశాఖలోని మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో 3 నూతన బస్సులను ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి రాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ..లాభ నష్టాలతో ప్రమేయం లేకుండా సిబ్బంది సేవలు అందిస్తున్నారన్నారు. ఆర్టీసీపై తనకు పూర్తి అవగాహన ఉందని చెప్పారు. సంస్థలో మరింత పురోగతి సాధిద్దామని తెలిపారు. కార్మికుడు - ప్రయాణికుడు రెండు కళ్లు లాంటి వారని చెప్పారు. కార్మికుడు సంతోషంగా ఉంటేనే సంస్థ బాగుంటుందని అన్నారు. నష్టాలు వచ్చాయని వదిలేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం కాదని స్పష్టం చేశారు. గతంలో అభివృద్ధి కుంటిపడిందన్నారు. ఏపీ ఆర్టీసీకి వేలాది కోట్ల ఆస్తులు ఉన్నాయన్నారు. ఆస్తులను అమ్ముకోవడం గత ప్రభుత్వం పనితనమని విమర్శించారు. కార్గో, కొరియర్ సర్వీస్‌లు ప్రారంభిస్తామని ప్రకటించారు. వచ్చే ఐదేళ్లలో అన్ని ఎలక్రిక్ బస్సులు ప్రవేశ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తాము వెనుకడుగు వేయమని కార్మికుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేరస్తామని హామీ ఇచ్చారు. 1400 కొత్త బస్సులు ఏపీకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

# 'కేంద్రీకృత' పరీక్షలు సరికావు





న్యూఢిల్లీ : దేశంలో వైద్య కోర్సుల ప్రవేశ పరీక్ష (నీట్) ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా ఉంది. పేపర్ లీక్‌లు, పరీక్ష వాయిదాలతో యూజీ, పీజీలలో అడ్మిషన్లు కోరే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోడీ సర్కారుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, 'వన్ నేషన్, వన్ ఎగ్జామ్'గా తీసుకొచ్చిన ఈ నీట్ ఒక విఫల ప్రయోగమని మేధావులు, విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) చీఫ్‌నుటం, కమిటీని ఏర్పాటు చేయటం కొంత వరకు జరిగినా విలువైన విద్యార్థుల మోడీ ప్రభుత్వం వృథా చేసిందని మేధావులు అంటున్నారు. 'నీట్' విషయంలో మోడీ సర్కారు వైఫల్యం స్పష్టంగా కనబడుతున్నదని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. అయితే, మోడీ ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చేలా మీడియా తన వంతు కృషి చేస్తుందని పలువురు నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాజకీయం నుంచి విద్య వరకు.. కేంద్రీకృతం చేయటానికి మోడీ ప్రభుత్వం ఇష్టపడదనీ, భారత్ విశాల దేశంలో ఈ విధానం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. నీట్-యూజీ, జేఇఇ, యూజీసీ-నెట్, సీయూటీ వంటి వాటితో సహా 15 ప్రధాన పరీక్షలు దేశంలో నిర్వహించబడుతున్నాయి. ఆచరణాత్మకంగా ఈ పరీక్షలను నిర్వహించడానికి సంబంధించిన పనులన్నీ అవుట్‌సోర్సింగ్ ద్వారా నిర్వహించబడుతుంది. వారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ప్రయివేటు సర్వీస్ ప్రొవైడర్లు తమ సిబ్బందితో పరీక్షలను నిర్వహించడం, ఐటీ సిస్టమ్‌లు, క్యూఆర్ కోడ్-సంబంధిత పని అన్ని సాంకేతిక పనులు ఔట్‌సోర్ ద్వారా జరుగుతుంది. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక పరీక్షలైన వీటికి ఔట్‌సోర్సింగ్ సహాయం తీసుకుంటే లీక్‌కు దారులు తెరిచినట్టేనని మేధావులు అంటున్నారు. ఈ పరీక్షల బాధ్యతను ఎన్‌టిఎ చేపట్టక ముందు సీబీఐ, ఏఐసీటీఈ వంటి ప్రభుత్వ సంస్థలు ఈ పరీక్షలను నిర్వహించేవి. స్టేట్ సెలక్షన్ బోర్డ్‌ల వంటి వివిధ రాష్ట్ర స్థాయి పరీక్షల నిర్వహణలో, అలాగే రైల్వేలు, బ్యాంకుల వంటి రంగాల కోసం రిక్రూట్‌మెంట్‌లో కూడా ఔట్‌సోర్సింగ్‌లో పాల్గొన్న విశ్లేషకులు అంటున్నారు. నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో ఇప్పుడు కనిపిస్తున్న లోపాలు రాష్ట్రాలలో పదేపదే బయటపడ్డాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రచురించబడిన ఒక ఆంగ్ల వార్తా సంస్థ సమాచారం ప్రకారం.. గత ఐదేండ్లలో 15 సంవత్సరాలలో కనీసం 48 పేపర్ లీక్ కేసులు కనుగొనబడ్డాయి. ఈ లీక్‌లు సుమారు 1.2 లక్షల పోస్టులకు కనీసం 1.4 కోట్ల మంది దరఖాస్తుదారుల జీవితాలను ప్రభావితం చేశాయి.

కేంద్రీకృత పరీక్షలు ఎందుకు?

మోడీ పాలనలో గత కొన్నేండ్లుగా 'కేంద్రీకృత' వ్యవస్థ అంశం ఎక్కువగా వినబడుతోంది. పరీక్షల నిర్వహణకు కేంద్ర పరీక్షా ఏజెన్సీని కలిగి ఉండాలనే ఆలోచన కూడా మొదట 1990ల ప్రారంభంలో సూచించబడిందన్నది విశ్లేషకులు చెప్తున్నారు. కానీ, మోడీ ప్రభుత్వం జాతీయవాద శక్తిపై "ఒకే దేశం, ఒకటే వస్తువు" అనే భావజాలాన్ని వ్యాపింపజేయాలని, దానిని ప్రజలపై బలంగా రుద్దాలని చూస్తున్నారని అంటున్నారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్, వన్ రేషన్ కార్డు, హెల్త్ కార్డు జాబితాలో ఇందులో భాగమని వారు చెబుతున్నారు. అన్ని ప్రాంతీయ ఆకాంక్షలు, వైవిధ్యాలకు భిన్నంగా ఇలాంటి కేంద్రీకృత వ్యవస్థలు ఏ మాత్రమూ శ్రేయస్కరం కావని మేధావులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్ నేషన్, వన్ ఎగ్జామ్ రాష్ట్రంలో విఫల ప్రయోగాలనీ, వీటితో మోడీ సర్కారు విద్యార్థులు, నిరుద్యోగులు, దేశ యువత భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు.

# పుణెలో జికా వైరస్ కలకలం.. ఇద్దరు గర్భిణులకు పాజిటివ్

పుణె: మహారాష్ట్రలోని పూణెలో జికా వైరస్ కలకలం సృష్టిస్తోంది. వైరస్ విజృంభిస్త ఇప్పటివరకు ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ బారినపడినవారిలో ఇద్దరు గర్భవతులు కూడా ఉన్నారు. దీంతో రాష్ట్ర ఆరోగ్యవిభాగం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తి నివారణకు పుణె మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. జికా వైరస్ వ్యాప్తికి కారణమైన దోమలను తరిమికొట్టేందుకు నగరంలో విస్తృతంగా ఫాగింగ్ చేస్తున్నారు.రాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపిన వివరాల ప్రకారం మొదటి కేసు నమోదైంది. 46 ఏండ్ల డాక్టర్ మొదట జికా వైరస్ బారిపడ్డారు. అనంతరం అతని కుమార్తె (15)కు వైరస్ సోకినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. వీరిద్దిరితోపాటు ముండ్వాకు చెందిన ఇద్దరి రిపోర్టులు పాజిటివ్‌గా వచ్చాయి. ఈ నాలుగురితోపాటు అరంద్వానేకు చెందిన ఇద్దరు గర్భిణులకు జికా సోకినట్లు వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.జికా వైరస్ సోకిన ఆడ ఎడిస్ దోమ కుట్టడం వల్ల వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వైరస్‌ను తొలిసారిగా 1947లో ఉ గాండా అడవుల్లోని ఓ కోతిలో పేర్కొన్నారు. ఆ తర్వాత ఆఫ్రికన్ దేశాలతోసహా



భారత్, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, వియత్నాం లాంటి ఆసియా దేశాలకూ ఈ వ్యాధి వ్యాప్తి చెందింది. ఈ వైరస్ సోకినవారిలో జ్వరం, చర్మంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, జీర్ణకోశ సంబంధ సమస్యలు, గొంతు నొప్పి, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

# ఉద్యోగాల కల్పన.. జాబ్ క్యాలెండర్‌పై కసరత్తు




హైదరాబాద్,జూలై2: వరుస ఎన్నికలతో కొంత ఆలస్యం అయినా.. తెలంగాణలో నిరుద్యోగులకు శుభవార్త చెప్పే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలను పకడ్బందీగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని, జాబ్ క్యాలెండర్ విడుదలకు సిద్ధపడుతోంది. గతంలో లాగా తప్పులు జరక్కూడదన్న సంకల్పంతో సాగుతోంది. గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా ఉద్యోగాల నియామక విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. నిరుద్యోగులు ఆ ప్రభుత్వం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తిని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ వారిని సంతృప్తి పరిచేలా హామీలను ఇచ్చింది. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు అడుగులు వేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. లీకేజీలు, పరీక్షల నిర్వహణ లోపాల వల్ల అనేక పరీక్షలు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రద్దయ్యాయి. ఈ నేపథ్యంలోనే రేవంత్ సర్కారు నిరుద్యోగుల్లో నెలకొన్న అపనమ్మకాన్ని పోగొట్టేలా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. గడిచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మేరకు టీజీపీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసి కొత్త పాలక మండలి నియమించింది. పరీక్షల నిర్వహణను యుపిఎస్సి తరహాలో చేపట్టేలా కట్టుదిట్టమైన విధానాలను అనుసరిస్తోంది. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా యుపిఎస్సి చైర్మన్ తోనూ భేటీ అయ్యారు. ప్రభుత్వం కూడా టీజీపీఎస్సీ పరీక్షలపై కోర్టు వివాదాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తోంది.ఇప్పటికే అధికారులు అందించిన ప్రాథమిక నివేదిక ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ దిశగా నిర్ణయం తీసుకోబోతున్నారు. అధికారులు కూడా జాబ్ క్యాలెండర్ కు సంబంధించి తుదిమెరుగులు దిగుతున్నట్లు చెబుతున్నారు. వారం రోజుల్లోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసే అవకాశం ఉందని అధికార వర్గాల నుంచి సమాచారం అందుతోంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్సి), తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్, ఇతర నియామక బోర్డులకు సంబంధించిన షెడ్యూల్ తో జాబ్ క్యాలెండర్ విడుదల అయ్యాక అధికారులు ఆ వివరాలను యూపీఎస్సీ, జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ, ఆర్ఆర్బి ఆర్ఆర్సి, బ్యాంకింగ్ వంటి ఇతర పోటీ పరీక్షల బోర్డులకు రాష్ట్రీయ కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు పంపనున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల ఉద్యోగాలకు టీజీపీఎస్సీ షెడ్యూల్ సమయంలో ఇతర పరీక్షల అడ్డంకులను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర జాబ్ క్యాలెండర్ కూడా యూపీఎస్సీ వంటి సంస్థల షెడ్యూల్ ను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అక్టోబర్ లో గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్ ను ప్రకటించారు. గ్రూప్-2 పరీక్షలను ఆగస్టులో నిర్వహించనున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న నోటిఫికేషన్లను మినహాయించి పగడ్బందీగా జాబ్ క్యాలెండర్ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దుకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో చేసిన అప్పీల్ ను ఉ పసంహరించుకుంది. పకడ్బందీగా గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించింది. ఇటీవల ప్రాథమిక కీ విడుదల కాగా, త్వరలో ఫలితాలు వెలువడనున్నాయి. ఉద్యోగాలు నియామకాల విషయంలో గతంలో అడ్డంకిగా ఉన్న రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్ల విషయంలో కోర్టులు పలు తీర్పులను ఇచ్చాయి. ఆయా తీర్పులకు అనుగుణంగా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని అనుసరించింది. దీని ప్రకారమే టీజీపీఎస్సీ మెడికల్ బోర్డు, పోలీస్, గురుకుల బోర్డుల ద్వారా నిర్వహించిన పలు పోస్టులకు సంబంధించి అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల్లోనే 28,942 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించింది. టీజీపీఎస్సీ కూడా నియామకాల విషయంలో వేగాన్ని పెంచింది. గతంలో పెండింగ్ లో ఉన్న గ్రూప్-4 ఫలితాలను విడుదల చేసింది. ఈ పోస్టులకు ప్రస్తుతం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పక్రియ కొనసాగుతుంది. 1540 ఏఈ పోస్టులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయింది. వ్యవసాయ, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో ఎంపికైన జాబితా విడుదలైంది. హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పోస్టుల పరీక్షలు పూర్తవగా, డివిజనల్ అకౌంట్స్ అధికారి (డిఏఓ) పరీక్షలు గత నెల 30 న ప్రారంభయ్యాయి. టెట్ పూర్తి చేసి 11,062 పోస్టులతో డీఎస్సీని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. నిరుద్యోగుల సమస్యలపై ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయానికి సరైన సమాధానం ఇచ్చే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి సర్కార్ వీలైనంత వేగంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. నాలుగైదు రోజుల్లోనే జాబ్ క్యాలెండర్ వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యలపై అధ్యయనం చేసి ఎప్పటికప్పుడు అన్ని విషయాలను తెలుసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే నిరుద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నేతలు ఆదేశించారు. గాంధీ ఆసుపత్రిలో విద్యార్థినేత మోతిలాల్ దీక్షపై ఆరా తీసిన ఆయన.. నిరుద్యోగుల విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించినట్లు సమాచారం. నిరుద్యోగుల సమస్యలు, జాబ్ క్యాలెండర్ విడుదల అంశాలపై పార్టీ విద్యార్థి, యువజన నాయకులతో త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు.

# రాహుల్ గాంధీ హీరో అయిపోయాడు..

న్యూఢిల్లీ,లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చాలాసార్లు అవమానాలే ఎదుర్కొన్నాడు. ఆయన ప్రసంగాల వీడియోలు గతంలో చాలా వరకు ట్రోలింగ్‌కే ఉపయోగ పడ్డాయి. సరిగా మాట్లాడలేదని.. సబ్జెక్ట్ ఉండని భాజపా వాళ్లు ఆయన్ని ఎప్పుడూ ఎగతాళి చేస్తారు.

ఐతే ఏ నాయ'కుడైనా కొన్నేళ్ల పాటు కష్టపడితే ఎదుగుదల ఉంటుందని.. సబ్జెక్ట్ పెంచుకోవడానికి ఒక పద్ధతి ప్రకారం కష్టపడితే ఫలితం ఉంటుందని.. జనాల్లో తిరిగితే ఆదరణ దానికంతట అదే వస్తుందని గాంధీ రాహుల్ విషయంలోనూ రుజువవుతోంది.గత కొన్నేళ్లలో రాహుల్ రాజకీయ నాయకుడిగా ఎంతో ఎదిగాడన్నది స్పష్టం. ఆయన ప్రసంగాలు కూడా ఇప్పుడు బాగా ఆకట్టుకుంటున్నాయి. గతంలో లోక్‌సభలో మోడీని ఎదుర్కోలేక ఢీలా పడ్డ రాహుల్.. ఇప్పుడు మోడీతో పాటు భాజపా సభ్యులందరినీ ఇరుకున పెట్టి డిఫెన్స్‌లోకి నెట్టేస్తున్నాడు.సోమ వారం లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగం చూస్తే బీజేపీ ఎంత డిఫెన్స్‌లో ప డిందో అర్థ మవుతుంది. మోడీనే కాక ఆ పార్టీ తరపున కొత్త స్పీకర్‌గా నియమితుడైన ఓం బిర్లాను కూడా ఉక్కిరిబిక్కిరి చేసాడు రాహుల్ గాంధీ.ఓం బిర్లా సభాపతిగా నియమిత ుడైనపుడు.. తనకు షేక్ హ్యాండ్ ఇచ్చినపుడు నిటారుగా నిలబడ్డారని.. కానీ మోడీ వస్తే మాత్రం వంగి వంగి దండాలెట్టారని హావభావాలతో రాహుల్ గాంధీ చూపించినపుడు సభ హోరెత్తింది.ఇక బీజేపీని యాంటీ హిందుగా రాహుల్ అభివర్ణించగానే.. మోడీ లేచి హిందువులను రాహుల్



అవమానిస్తున్నాడని వివరించారు.. బీజేపీ హిందుత్వానికి పేటెంట్ తీసుకోలేదంటూ ఘాటుగా స్పందించాడు రాహుల్. దీంతో మోడీ సైలెంట్ అయిపోవాల్సి వచ్చింది.మరోవైపు శివుడి ఫొటో తెచ్చి తన వెనుక ఉన్న బలం ఆయనే అని రాహుల్ చెబుతుండగా.. కెమెరా రాహుల్ మీది నుంచి ఔట్ ఆఫ్ ఫోకస్ అయిపోవడంతో ఆ విషయాన్ని కూడా ఎక్స్‌పోజ్ చేస్తూ సభను ఎండియే ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరు రాహుల్ దుయ్యబట్టాడు. మొత్తంగా సోమవారం నాటి తన ప్రసంగం, చార్యలతో రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో హీరో అయిపోయాడనే చెప్పాలి.

# ఆయిల్ పామ్ రైతు కుదేలు



రాజమహేంద్రవరం : ఆయిల్‌పామ్ సాగు నష్టాల బాట పట్టింది. కేంద్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్‌పై దిగుమతి సుంకం రద్దు చేయడంతో ఈ పరిస్థితి. ఇతర దేశాల నుంచి ఆయిల్‌పామ్‌ను దిగుమతి చేసుకుంటుండడంతో ధరలు నేలచూపు చూస్తున్నాయి. 2022లో ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు భిన్నంగా రూ.26,365 ధర లభించింది. 2023 జూన్‌లో 18,100 ధర వచ్చింది. తాజాగా టన్ను ధర రూ.13,180కి పడిపోయింది. ఇదే ధర కొనసాగితే ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి 4 జిల్లా19 మండలాల్లో 0,826 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. అత్యధికంగా నల్లజర్లలో 10,490 ఎకరాల్లో, అత్యల్పంగా కడియం మండలంలో మూడు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా ధరలు తిరోగమనంలో ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం టన్నుకు రూ.20 వేలు ఇప్పించాలని కోరుతున్నారు.

గతంలో లాభాల బాట

జిల్లాలో పండిన ఆయిల్‌పామ్ గెల గానుగ ఆడించి, ముడి ఆయిల్‌ను పెద్దాపురం, నల్లజర్లలోని మిల్లులకు తరలిస్తారు. ఆయా మిల్లుల్లో ప్రతి నెలా సగటు ముడి చమురు నిష్పత్తి (ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో-ఒయిఆర్) ఆధారంగా అధికారులు, వ్యాపారుల కమిటీ ఆయిల్‌పామ్ గెలలకు ధర నిర్ణయిస్తుంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధంతో ఆ దేశాల నుంచి క్రూడ్ పామాయిల్ (సిపిఒ) దిగుమతి నిలిచిపోయింది. దేశీయంగా వంట నూనెలను ఉత్పత్తి చేసే కంపెనీలకు ముడిసరకు కొరత ఏర్పడింది. దేశీయ రైతుల నుంచి ఆయిల్‌పామ్ గెలలను ఆయా కంపెనీలు పోటీ పడి కొనుగోలు చేశాయి. 2022 మార్చిలో టన్నుకు రూ.21,940, ఏప్రిల్‌లో రూ.22,518, మేలో రూ.23,365, జూన్‌లో రూ.26 వేల వరకు ధర పలికింది.

కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణం

కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని రద్దు చేయడంతో గడిచిన రెండేళ్లుగా ఆయిల్‌పామ్ ధరపై తీవ్ర ప్రభావం పడుతోంది. 2020 సెప్టెంబరులో టన్ను ధర రూ.10,112 ఉంది. ఆ తర్వాత ధర క్రమేపీ పెరిగింది. 2021 జనవరిలో రూ.15,500, జూన్‌లో రూ.16,828 ధర లభించింది. 2022 చివరిలో బిజెపి ప్రభుత్వం క్రూడ్ పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని 30 శాతం నుంచి 20 శాతం తగ్గించింది. తిరిగి కొన్ని నెలల వ్యవధిలోనే దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తేసింది. దీంతో, ఆయిల్ కంపెనీలు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. దీంతో, దేశీయ మార్కెట్‌లో ఆయిల్‌పామ్ ధరలు పతనం అవుతున్నాయి.టన్నుకు కనీసం రూ.20 వేలు ఇవ్వాలి : పాతూరి సత్యనారాయణ, పామాయిల్ రైతు, అచ్చెన్నపాలెం, నల్లజర్ల మండలంఆయిల్‌పామ్ సాగు దాదాపుగా ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. టన్ను రూ.13,180 మించి కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ధరలు పెరగడంతో సాగు ఖర్చులు ఘననీయంగా పెరిగాయి. ఎకరా విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగుకు రూ.75 వేల వరకూ ఖర్చవుతోంది. ఓ వైపు దిగుబడి తగ్గిపోవడం, తిరిగి ధర లేకపోవడంతో పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి అందలేదు. తనకు కనీసం రూ.20 వేలు ఇస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది.

## ఎపి పునర్నిర్మాణానికి సహకరించండి

న్యూఢిల్లీ, ఏపీ పునర్నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చేయూత ఇవ్వాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణదేవరాయలు తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానం సందర్భంగా లోక్ సభలో మాట్లాడారు. ఏపీ ప్రజలు 90శాతం సీట్లు,56 శాతం ఓట్లతో ఎన్డీఏ కూటమిని గెలిపించారని చెప్పారు. ఏపీ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. పోలవరం,అమరావతి నిర్మాణం వేగంగా పూర్తి చేయడానికి నిధులు ఇవ్వాలని కోరారు. ఏపీకి రావాల్సిన రెవిన్యూ గ్రాంట్స్ విడుదల చేయాలని అన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన విద్యాసంస్థల నిర్మాణం వేగంగా చేయాలన్నారు. వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పూర్తి చేస్తే రాష్టానికి పెట్టుబడులు వస్తాయని లావు కృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

# బొగ్గుగనుల వేలానికి వ్యతిరేకంగా ఐక్యపోరాటం

హైదరాబాద్:దేశంలోని బొగ్గు గనుల్ని వేలం వేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలకు పిలుపునిచ్చాయి. దానిలో భాగంగా ఈనెల 5న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించారు. 10వ తేదీ సింగరేణి శాఖా కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. వేలం జరిగే 17వ తేదీ నాడు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తామంటూ కార్యాచరణ ప్రకటించారు. రాష్టానికి చెందిన ఎంపీ జీ కిషన్‌రెడ్డికి బొగ్గు, గనుల శాఖను కేటాయించి, హైదరాబాద్ నుంచే వేలం ప్రక్రియను ప్రారంభించడాన్ని కార్మిక సంఘాలు తప్పుపట్టాయి. రాష్ట్ర విస్తృత ప్రయోజనాలు, సింగరేణి కాలరీస్ భవిష్యత్ దృష్ట్యా గోదావరి పరీవాహక ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ వేలంను తక్షణమే నిలుపుదల చేసి, దాన్ని సింగరేణికే కేటాయించాలని కార్మికసంఘాల నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'సింగరేణికి శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ కేటాయించాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు బావుల వేలాన్ని రద్దు చేయాలి' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్‌టేబుల్‌లో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు జనక్‌ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్డీ చంద్రశేఖర్, హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కే సూర్యం, బీఆర్‌టీయూ అధ్యక్షులు జీ రాంబాబు, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షులు అనూరాధ, టీఎన్‌టీయూసీ అధ్యక్షులు ఎమ్‌కే బోస్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బీ మధు తదితరులు పాల్గొని మాట్లాడారు. సీఐటీయూ రాష్ట్ర ఆఫీస్ బేరర్ భూపాల్ సమావేశంలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి అన్ని జాతీయ, కార్మిక సంఘాలు ఆమోదం తెలిపాయి. భవిష్యత్ కార్యాచరణను ఉమ్మడిగా అమల్లోకి తేవాలని నిర్ణయించాయి. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సింగరేణి భవిష్యత్ గురించి వివరించి,



శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ వేలాన్ని నిలుపుదల చేసేలా కోరాలని సమావేశం నిర్ణయి ంచింది. ఆ బాధ్యతను ఐఎన్‌టీయూసీ నేతలు తీసుకోవాలని కోరగా, వారు అందుకు అంగీకరించారు. అలాగే ప్రతిపక్షనేత, బీఆర్‌ఎస్ అధ్యక్షులు కే చంద్రశేఖరరావును కూడా కలిసి మద్దతు కోరాలనీ, ఆ బాధ్యతను బీఆర్‌టీయూ నాయకులు తీసుకోవాలని కోరారు. రాష్ట్రస్థాయి కార్మిక సంఘాల ఐక్యతను సింగరేణిలో క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని చెప్పారు. కేంద్రం ప్రతిపాదించిన నాలుగు లేబర్ కోడ్‌లు ఇప్పటి వరకు పార్లమెంటు ఆమోదం పొందలేకపోయాయనీ, దీనికి జాతీయ కార్మిక సంఘాల ఐక్య పోరాటాలే కారణమని విశ్లేషించారు. రైతు నల్లచట్టాల్ని కేంద్రం వెనక్కి తీసుకోకతప్పలేదనీ, అదే స్ఫూర్తితో ఉద్యమిస్తే, సింగరేణి పరిరక్షణతో పాటు బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకోగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బొగ్గు గనుల వేలం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పక్కనే కూర్చుని ఉన్నారనీ, శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ వేలాన్ని మాత్రం నిలువరించలేకపోయారని విమర్శించారు. సింగరేణి సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేలకోట్ల రూపాయలు డివిడెండ్లు, పన్నుల రూపంలో చెల్లిస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ.30వేల కోట్లు చెల్లించాల్సి ఉందనీ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సింగరేణి పాత్రను కీలకంగా గుర్తించలేకపోతు న్నారని ఆక్షేపించారు. కార్మిక సంఘాలు ఇచ్చిన ఆందోళనల్లో సింగరేణి ఉ ద్యోగులతో పాటు సాధారణ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com